Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 2 | కరీంనగర్ | బుధవారం 27 మే 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## గవర్నర్‌ను కలిసిన టీఆర్ఎస్ అధినేత కవిత

**- వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని వినతి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే 26 : ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరినట్లు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తెలిపారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. వెలుగుమట్లతో పాటు

11లో

## ఎసిబి పట్టుబడ్డ మహిళా తహసిల్దార్

**- 2 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**

మేడ్చల్ మల్కాజిగిరి, మే 26 : రాష్ట్రంలో మరో అవినీతి అధికారిణి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సోమవారం ఇద్దరు, మంగళవారం మరో ఇద్దరు అధికారులకు చిక్కడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలానికి చెందిన తహసీల్దార్ టి.సుచరిత రెండు లక్షల రూపాయలు తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ కేసులో ఆమె డ్రైవర్ వి.నాగేష్‌ను కూడా అరెస్టు చేశారు. 30 ఎకరాల వ్యవసాయ

11లో

# ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

**- అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నాం**

**- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26 : ఎబోలా వైరస్‌పై తెలంగాణ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎబోలా కేసులు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎబోలా లక్షణాలు ఉన్న వారిని గుర్తించలేదని పేర్కొన్నారు. ఎబోలాపై రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించిందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కట్టుదిట్టమైన స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఆర్సీ, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్కానింగ్ చేస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గాంధీ ఆస్పత్రిలో 10 పడకల ఐసోలేషన్ వార్డు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు. డాక్టర్ సునీల్ కుమార్ నోడల్ అధికారిగా నియామించినట్లు చెప్పారు. అనుమానితుల సాంపుల్స్‌ను మహారాష్ట్ర పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపామన్నారు. ౧దేశాల నుంచి 58 మంది ప్రయాణికులు హైదరాబాద్‌కు చేరుకున్నారన్నారు. వారిలో ఎవరికీ ఎబోలా లక్షణాలు లేవని తెలిపారు. 58 మందిని 21 రోజుల పాటు హోమ్ ఐసోలేషన్‌లో అధికారులు ఉంచారని గుర్తు

11లో



# ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా'

**- సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు**

**- భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26 : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో

11లో

## యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

**- యుద్ధ ప్రభావంతోనూ సరఫరాలో అంతరాయం**

**- రైతులు పంట వ్యర్థాలను తగులబెట్టవద్దు**

**- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26 : యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు. ఇకపోతే రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ

11లో

## దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

**- తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కేవలం నలుగురే**

**- పోలీసులకు లొంగిన నరహరి, ధనమ్మ**

**- జంటకు చెక్కులు అందచేత**

**- గణపతి తదితరులు కూడా వెంటనే లొంగిపోవాలి**

**- డిజిపి సివి ఆనంద్ పిలుపు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26 : మావోయిస్టు పార్టీలో నాలుగు న్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో

11లో

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 26 : రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా విఫలం అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా

11లో

## తెలంగాణలో అవినీతి రాజ్యం

**- అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్**

**- శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్**

**- సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం**

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26 : తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూముల ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని

11లో

## మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

**- నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం**

**- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ**






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,మే 26 : కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి

11లో

## ఎండల తీవ్రత మరింత పెరుగుదల

**- రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26 : ఈ ఏడాది నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు ఉన్నట్టు వాతావరణశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఎండల తీవ్రత మరింతగా కొనసాగనుంది. వరుసగా రోహిణి రెండోరోజు కూడా ఎండలు మండుతున్నాయి. నిజానికి రుతుపవనాలు ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ వాతావరణ మార్పులతో, జూన్ 5నుంచి 10 వరకు నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉన్నదని తెలిపింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్టు హెచ్చరించింది. 20 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాంలో అత్యధికంగా 46.5 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా దండేపల్లిలో 46.4, సూర్యాపేట జిల్లా మద్దిరాలలో 46.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 46.3, ఖమ్మం జిల్లా ఏన్కూర్‌లో 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది. రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్‌జారీ చేసినట్టు తెలిపింది.

11లో

## మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

**- సంపద సృష్టించే శక్తిగా మహిళలకు ప్రోత్సాహం**

**- సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించిన సీతక్క**






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26 : మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ

11లో

## చొరబాటు దారులూ పారిపోండి

**- వెళ్లగొట్టక ముందే పారిపోతే మంచిది - జైల్లో పెట్టి తిండి పెట్టేది లేదు - బంగ్లాదేశ్ వలసదారులకు సిఎం సువేందు హెచ్చరిక**

**- సరిహద్దుల వద్దకు చేరుకుంటున్న అక్రమవసలదారులు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



కోల్‌కతా, మే 26 : పశ్చిమబెంగాల్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ అక్రమవలసదారులపై చర్యలను సువేందు అధికారి ప్రభుత్వం ముమ్మరం చేసింది. అక్రమవలసదారులను వారి స్వదేశానికి పంపేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారుల పై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు.

11లో

# పాలమూరు ప్రాజెక్టులపై వేగం పెంచాలి..

## అధికారులకు మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 26 : వనపర్తి జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఇరిగేషన్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో సాగు, తాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడంతో పాటు భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెం రిజర్వాయర్ కార్యాలయంలో పాలమూరు-రంగారెడ్డి, మహాత్మాగాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ గణప సముద్రం భూసేకరణ, కొంకాలపల్లి, బొంకలపల్లి, బంద్రాయిపాకుల గ్రామాల పునరావాస కేంద్రాలకు సంబంధించిన పరిహారం ఇప్పటికే చెల్లించినట్లు తెలిపారు. ప్యాకేజీ-27 కింద ఇంకా 68.12 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని, దాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజీ-29లో డి-5 కాలువ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బుద్ధారం స్టేజ్-1, స్టేజ్-2 పరిధిలో డి-5, డి-8 కాలువల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్యాకేజీ-27లో కానయపల్లి వద్ద పనులు ఆలస్యమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, 60-సి కింద నోటీసులు జారీ చేసి అవసరమైతే మరో కాంట్రాక్టర్‌తో పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. బుద్ధారం కుడికాలువను 14.6 కిలోమీటర్ల మేర విస్తరించడంతో పాటు గట్లఖానాపూర్ రిజర్వాయర్, బుద్ధారం-2 రిజర్వాయర్, గొల్లపల్లి రిజర్వాయర్, తాడిపర్తి చెరువు అదనపు పనులు, ఘనపూర్ బ్రాంచి కెనాల్, కర్నె తాండా లిఫ్ట్ ఇరిగేషన్, రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రాజీవ్ భీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్-2 కింద ఏనుకుంట రిజర్వాయర్ నుంచి రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు మెయిన్ కెనాల్ వెడల్పు పనుల మంజూరుకు కూడా ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు తెలిపారు. ప్యాకేజీ-19లో దెబ్బతిన్న పైపులను మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పెబ్బేరు చెరువు నిల్వ సామర్థ్యాన్ని 5 టీఎంసీలకు పెంచేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని మంత్రి, ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ చంద్రశేఖర్, పార్థసారథి, ఈఈలు అమర్ సింగ్, రవీందర్, శ్రీనివాస్, వనపర్తి ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.



# రాబోయే గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

## దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 26 : రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. మంగళ వారం సరస్వతి పుష్కరాల 6వ రోజు సందర్భంగా కాళేశ్వరం మెగా విశ్రాంతి భవనంలో గోదావరి పరివాహక ప్రాంతాలకు చెందిన భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్,పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు సుమారు రూ. 1000 కోట్ల నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా ఎదురైన లోటు పాట్లను గుర్తించి, గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, త్రాగునీరు,మరుగుదొడ్లు, పార్కింగ్,విద్యుత్ సరఫరా, భద్రత,వీఐపీ,వివిఐపీ పర్యటనలకు అవసరమైన ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల మరమ్మ తులు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు,అత్యవసర సేవల అందు బాటు వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో పనిచేయా లని ఆదేశించారు. ఈ సమావేశంలో నిజామాబాద్, నిర్మల్ జిల్లాల అదన పు కలెక్టర్లు బుజంగరావు,వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి,కాటారం ఆర్డీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కె. హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, మే 26 : జూన్ 1వ తేదీన కొమరంభీం ఆసిఫాబాద్ మండలం కొలం కొతారి గ్రామానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్నందున, అందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కెరమెరి మండలం కోలం కొతారి గ్రామాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.దాస్, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావు, రాష్ట్ర ఇంజనీరింగ్ ముఖ్య అధికారులు మరియు ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి గారి పర్యటన నిమిత్తం హెలిప్యాడ్ పనులను త్వరితగతిన, సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురికి కాలువల పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత నిర్మాణాలను, మురికి కాలువల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ప్రారంభించబోయే సీసీ రహదారి ఇరువైపులా ముగ్గులు వేయాలని, ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసేందుకు సర్వసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గృహాలను చక్కగా అలంకరించాలని, ఇందిరమ్మ ఇళ్ల ముందు పరిసరాలు చాలా శుభ్రంగా ఉండాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉన్నందున, అందుకోసం ప్రత్యేక వేదికను సిద్ధం చేయాలన్నారు. అదే విధంగా, సభకు విచ్చేసే ప్రజలకు మరియు లబ్ధిదారులకు



తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట్ల షామియానాలు, కుర్చీలు సిద్ధం చేసి ఉంచాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సభ ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా, ప్రతీ ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఏర్పాట్లను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, పీడీ ప్రకాష్ రాజు, ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు యువ కార్మికులు ముందుకు రావాలి

## - ఎఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు చంద్రగిరి శంకర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, మే 26 : సింగరేణి సంస్థను ప్రభుత్వాలు ఆదాయ వనరుగా ఉపయోగించడం ఆందోళనకరమని ఎఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు చంద్రగిరి శంకర్ విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో కూడా సింగరేణిపై ఇంతటి ఆర్థిక భారం మోపలేదని, ప్రస్తుతం సంస్థ నిధులను ప్రభుత్వ అవసరాలకు మళ్లించడం వల్ల సింగరేణి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కిట్లు, మెడికల్ కాలేజీలు, గురుకుల పాఠశాలలు వంటి ప్రభుత్వ కార్యక్రమాలకు సింగరేణి నిధులను వినియోగించడం సమంజసం కాదన్నారు. సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను సింగరేణి ప్రాంతాల అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సింగరేణిలో 20 గనులు మూతపడగా, ఒక్క కొత్త గని కూడా ప్రారంభం కాలేదని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు 1.20 లక్షల మంది కార్మికులతో కళకళలాడిన సింగరేణిలో ప్రస్తుతం ఉద్యోగుల సంఖ్య 40 వేలకే పరిమితమైందని తెలిపారు. యువ కార్మికులను "జనరల్ అసిస్టెంట్" పేరుతో అన్ని రకాల పనులు చేయించుకుంటూ వారి హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. జనరల్ అసిస్టెంట్లను "మల్టీ జాబ్ వర్కర్స్"గా గుర్తించి తగిన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి పరిరక్షణ కోసం యువ కార్మికులు, ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని, కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని చంద్రగిరి శంకర్ కోరారు.



# శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండగను జరుపుకోవాలి

## - రామగుండం మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 26 : బక్రీద్ పండుగను మత సామరస్యంతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. బక్రీద్ పండుగ ఏర్పాట్ల గురించి వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు , కార్పొరేటర్లు , ముస్లిం మత పెద్దలతో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళ వారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాలమేరకు బక్రీద్ పండుగ పురస్కరించుకొని రామగుండం నగర పాలక సంస్థ రూ 12.00 లక్షల రూపాయలు వెచ్చించి ముస్లిం లు నమాజ్ చేసుకోవడానికి వీలుగా టెంట్లు , మంచి నీళ్ళు , మైక్ తదితర వసతులు నగర పాలక సంస్థ పరిధిలోని ఈద్గా ల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బక్రీద్ సందర్భంగా నిబంధనలు పాటిస్తూ పశు వధ విషయంలో చివరి క్షణం వరకు వేచి చూడకుండా ముందుగా పశు వైద్యాధికారి నుంచి అనుమతి పొందాలని అన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు లేదా అపోహలు సృష్టించే మెసేజ్ లు పెట్టడం, షేర్ చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. సహాయం అవసరమైన పక్షం లో రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో తమని సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా పండుగ ఏర్పాట్లకు సహకరించాలని కోరారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ బక్రీద్ పండుగ పురస్కరించుకొని రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని. ఇంకా ఏవైనా ఏర్పాట్లు అవసరమైన పక్షంలో దృష్టికి తీసుకురావాలని కోరారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఏడు ఈద్గాల వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు. పశువధ విషయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఈ మేరకు త్వరితగతిన పశువుల ఆరోగ్య ధ్రువీకరణ జారీ చేసేందుకు అదనంగా సరిపడినశీత పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వధకు అర్హత లేని పశువులను తరలించేందుకు గోశాల కూడా సిద్ధంగా ఉందని అన్నారు. ఏర్పాట్లకు సంబందించి ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించిన భాధ్యతలను నిర్వర్తించాలని కోరారు. ఎసిపి ముడుత రమేష్ మాట్లాడుతూ చట్ట ప్రకారం నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. జంతు రవాణా, ఇతరత్రా విషయాల్లో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజలకు సౌలభ్యం కలిగించేందుకు పోలీసులు పని చేస్తున్నారని గుర్తించాలని కోరారు. పశువైద్యాధికారి ప్రసాద్ మాట్లాడుతూ పశు వధకు సంబంధించి ముందుగా తమ వద్ద అనుమతి తీసుకోవాలని కోరారు. ధరఖాస్తు ఫారాలు తదితర వివరాలకు తనను ఫోన్ నెం : 8790 997693 లో కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సిఐలు ఇంద్రసేనా రెడ్డి, ప్రసాద రావు, రాజేశ్వర్ రావు, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర పలువురు కార్పొరేటర్లు, ముస్లిం మత పెద్దలు, ఎన్‌టిపిసి, సింగరేణి, ఆర్ఎఫ్‌సిఎల్ అధికారులు పాల్గొన్నారు.

# వనపర్తిలో మానవత్వం చాటుకున్న రక్తదాత మురళి

## - అత్యవసర సమయంలో స్పందించి మహిళకు రక్తదానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, మే, 26 : వనపర్తి పట్టణంలో ఓ రక్తదాత మానవత్వాన్ని చాటుకుని ఓ మహిళ ప్రాణాలను కాపాడేందుకు ముందుకొచ్చాడు. స్థానిక పట్టణానికి చెందిన మైనుద్దీన్ భార్యకు అత్యవసరంగా 'ఏ పాజిటివ్' రక్తం అవసరమైంది. కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న సమయంలో సామాజిక కార్యకర్త, రక్తదాత మురళి సమాచారం అందగానే వెంటనే స్పందించారు. రోగి పరిస్థితిని తెలుసుకుని మంగళవారం సాయంత్రం అవసరమైన రక్తాన్ని సమయానికి అందజేసి మహిళకు సహాయం చేశారు. అత్యవసర సమయంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా ముందుకొచ్చిన మురళి సేవా భావాన్ని పట్టణ ప్రజలు అభినందించారు. రోగి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ క్లిష్ట సమయంలో స్పందించి తమకు అండగా నిలిచిన మురళికి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం ద్వారా మరో ప్రాణానికి జీవం పోసిన ఆయన సేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శమని కొనియాడారు.

# కార్మికుల హక్కులను తాకట్టు పెడుతున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

## సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటి (గోదావరిఖని), మే 26 : సింగరేణి కార్మికుల హక్కులను గుర్తింపు, ప్రాతినిధ్యా సంఘాలు తాకట్టు పెట్టు తున్నాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి అన్నారు. గోదావరిఖని చౌరస్తా లోని యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి కార్మికుల సమస్యల మీద పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని కార్మికులందరినీ నమ్మ బలికించి యజమాన్యం పిలవగానే సంకనజేరి హక్కులను తాకట్టు పెట్టి పైరవీలు చేసుకుంటున్నరని ఆరోపించారు. అలాగే ప్రభుత్వ సంఘం ఐఎన్టియుసి ప్రాతినిధ్య సంఘంగా ఉండి ప్రశ్నించకుండా ఐక్య పోరాటాలకు సిద్ధమంటూనే ప్రభుత్వ యాజమాన్యాల కనుసన్నల్లో నడుస్తున్న పరిస్థితి కార్మికులు గమనిస్తున్నారన్నారు, ఇలాంటి పరిస్థితులలో మెడికల్ బోర్డు ప్రారంభించామని ఈ రెండు సంఘాలు పెద్ద ఎత్తున ప్రచారం చేసి గతంలో అనారోగ్యం పాలైన కార్మికులకు పెట్టిన మెడికల్ బోర్డును మా ఘనత అని చెప్పుకుంటున్న ఈ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు సమాధానం చెప్పాలని అయన డిమాండ్ చేశారు. అనారోగ్యంగా ఉన్న కార్మికులను ఇన్ వాలిడేషన్ చేయకుండా కార్పొరేట్ హాస్పిటల్కు రెఫర్ చేయడం అంటేనే వారికి ఆర్థిక నష్టం కలిగిస్తూ,మరోసారి అవినీతికి అవకాశం ఇవ్వడమేనని అన్నారు. ఒకపక్క అవినీతిని నిర్మూలిస్తామని ప్రభుత్వం చెప్తూనే అవినీతికి అవకాశం కల్పిస్తున్నా రన్నారు. ప్రతిసారి కార్మికులను మోసం చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అనేది గుర్తుంచుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో తోటనరహరి రావు, ఆరేపల్లిరాజమౌళి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బక్రీద్ పండుగను ప్రశాంతంగా, జరుపుకోవాలి

## - సైబరాబాద్ సీపీ డా.ఎం. రమేష్

## - పండుగ నేపథ్యంలో సమన్వయ సమావేశం నిర్వహించిన సీపీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి, మే 26 : బక్రీద్ పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని సైబరాబాద్ సీపీ డా.ఎం. రమేష్ పేర్కొన్నారు. రాబోయే బక్రీద్ సందర్భంగా పండుగను ప్రశాంతంగా, పరిశుభ్రంగా నిర్వహించేందుకు సైబరాబాద్ సీపీ డా.ఎం. రమేష్ ఆధ్వర్యంలో సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖ అధికారులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికారులు, ఎస్‌హెచ్‌వోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పరిశుభ్రత, ప్రజారోగ్యం, జంతు వ్యర్థాల సక్రమ నిర్వహణపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈద్‌గాహ్‌లు, మసీదులు మరియు నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాల సేకరణ కోసం మందమైన నల్ల పాలిథిన్ కవర్లు అందుబాటులో ఉంచడం, వ్యర్థాల తరలింపుకు తగిన వాహనాలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులు చర్చించారు. అలాగే రోడ్లు, ప్రజా ప్రదేశాల శుభ్రత కోసం తగినన్ని వాటర్ ట్యాంకర్లు, పారిశుధ్య సిబ్బందిని నియమించడం, అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించడం ద్వారా దుర్వాసన నివారణతో పాటు పరిశుభ్రతను కాపాడాలని సూచిం చారు. పండుగ సందర్భంగా పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఈద్‌గాలు, మసీదులు, నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా అధికారులు సూచించిన విధంగా పాలిథిన్ కవర్లలో సేకరించాలని తెలిపారు. వ్యర్థాల తొలగింపు,రోడ్ల శుభ్రత, పారిశుధ్య నిర్వహణ కోసం సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సైబరాబాద్ సీపీ డా.ఎం. రమేష్ మాట్లాడుతూ పండుగ సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య సిబ్బంది, వాటర్ ట్యాంకర్లు, వ్యర్థాల తరలింపు వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించి పరిశుభ్రతను కాపాడాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజలు కూడా పోలీసులకు, సంబంధిత శాఖల అధికారులకు సహకరించి పరిశుభ్రత, ప్రజారోగ్యం, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎస్‌బి డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ హెడ్ క్వార్టర్ డీసీపీ సంజీవ్ ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలుపై అపోహలు సృష్టిస్తున్న బీజేపీ

## - ప్రతి గింజను కొనుగోలు చేస్తాం - ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 26 : ధాన్యం కొనుగోలు విషయంలో బీజేపీ రైతుల్లో అపోహలు సృష్టిస్తూ గందరగోళ పరిస్థితులు కల్పించే ప్రయత్నం చేస్తోందని కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసమే రైతు భరోసా యాత్ర నిర్వహిస్తున్నారని విమర్శించారు. మంగళవారం భువనగిరి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు పంటల సీజన్లుగా కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడంతో మిల్లుల్లో ధాన్యం నిల్వలు పెరిగిపోయాయని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఆర్డర్లు ఇవ్వకపోవడమే ప్రస్తుత పరిస్థితికి కారణమన్నారు. అధికారులు, మిల్లర్లు, రైతులతో సమన్వయం చేస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సమీక్షలు నిర్వహిస్తూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు. పండిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రైతులు ప్రతిపక్షాల మాటలు నమ్మి అయోమయానికి గురికావద్దని సూచించారు. తెలంగాణలోనే అధిక ధరకు వడ్ల కొనుగోలు జరుగుతోందని, కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గతంలో "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులు ఉండేవని, ప్రస్తుతం రైతును రాజుగా చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి ఉద్యమాల తర్వాత వెనక్కి తీసుకున్నది బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. రైతు భరోసా యాత్రను తెలంగాణలో కాకుండా ఢిల్లీలో నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బీజేపీ నాయకులకు సవాల్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేష్ చిస్తి, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు

# "పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసి రైతాంగానికి నీళ్లు అందిస్తాం"

## - బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారమే చేస్తోంది - మంత్రి జూపల్లి కృష్ణారావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నాగర్ కర్నూల్, మే 26 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విమర్శించారు. అసలు కాలువలు, మోటార్లు, పంప్ హౌస్‌లు పూర్తి కాకుండానే ప్రాజెక్టు పూర్తైందని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని ఆయన మండిపడ్డారు. మంగళవారం నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ప్రధాన భాగాలైన నార్లాపూర్ రిజర్వాయర్ పంప్ హౌస్, ప్యాకేజీ-3, ఏదుల పంప్ హౌస్, రిజర్వాయర్, కుమ్మెర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.80 వేల కోట్ల అంచనాలతో ప్రాజెక్టును ప్రారంభించి, పదేళ్లలో కేవలం రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. ప్రాజెక్టు పూర్తికి అవసరమైన ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలు నిర్మించకుండా ఎన్నికల సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఒక్క పంపును గంటపాటు నడిపించి గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. నార్లాపూర్ వద్ద ఏర్పాటు చేయాల్సిన తొమ్మిది మోటార్లలో కేవలం మూడు మాత్రమే అమర్చబడ్డాయని, మిగతా మోటార్లను ప్రస్తుత ప్రభుత్వం వేగంగా ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువచ్చి నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని 4.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నార్లాపూర్ నుంచి ఉద్దండాపూర్ వరకు పెండింగ్‌లో ఉన్న ప్రధాన కాలువల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. మొత్తం 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని జూపల్లి ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్ల సామర్థ్యం కేవలం 4 టీఎంసీలే కావడంతో లక్షిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందడం సాధ్యం కావడం లేదన్నారు. 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలంటే కనీసం 25 టీఎంసీల నిల్వ సామర్థ్యం అవసరమని వివరించారు. జూరాల, నెట్టెంపాడు, భీమా, కోయిలాసాగర్ వంటి ప్రాజెక్టులకు కూడా సరిపడా నిల్వ సామర్థ్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలమూరు ప్రాంతాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించిన మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి త్వరలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటించి సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తారని వెల్లడించారు. అచ్చంపేట, వనపర్తి, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో చివరి ఆయకట్టు వరకు నీరందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. రైతాంగానికి శాశ్వత నీటి పరిష్కారం అందించేందుకు పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.



# ఐకెపి కల్లాల్లో వరి ధాన్యాన్ని వెంటనే తరలించాలి

## - అధికారులను ఆదేశించిన రామగుండం ఎమ్మెల్యే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 26 : ఉమ్మడి రామగుండం మండలం పాలకుర్తి అంతర్గాం మండలాల ఐకెపి కల్లాల్లో రైతులు నిలువచేసిన వరి ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం పొట్యాలగ్రామం ఐకెపి కల్లంలో ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ఐకెపి సెంటర్లో నిలువ ఉంచిన వడ్లకు ఎండ తీవ్రత కారణంగా స్వల్పంగా మంటలు అంటుకున్న ఘటనపై సమాచారం రాగానే వచ్చానని రైతులకు నిరంతరం అండగా ఉండడమే తన లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్పించవద్దని పదేపదే అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సందర్శనలో కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.





# ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ ఆందోళన

## - ఎద్దుల బండ్లతో నిరసన ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 26 : కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను వరుసగా పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతోందని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేన రెడ్డి నాయకత్వం వహించారు.

జిల్లా కేంద్రంలోని రామాలయం నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు ఎద్దుల బండ్లతో ర్యాలీ చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. పెరుగుతున్న ఇంధన ధరల కారణంగా ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని, దీంతో సామాన్యులు, రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపుతో మధ్యతరగతి, పేద కుటుంబాల జీవనం భారంగా మారిందని విమర్శించారు. రైతులు సాగు ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందని, రవాణా చార్జీలు పెరగడంతో ప్రతి వస్తువు ధరపై ప్రభావం పడుతోందన్నారు. డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని చెప్పారు. ధరల పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారం మోపే విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.

# గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు

## కల సాకారంచేసిన రామగుండం ఎమ్మెల్యే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, మే 26 : అంతర్గాం మండలంలో ఇల్లు లేని నిరుపేదలు గూడు నీడ కరువై నిస్సహాయ స్థితిలో బతుకుతున్న బతుకుల్లో వెలుగు నింపేందుకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ 40 నుంచి 50 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారు. అయితే బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ పరిధి మర్రిపల్లి గ్రామంలో కందుగుల స్వాతి-చందు దంపతులు ఇందిరమ్మ నూతన గృహాన్ని పూర్తి చేయడంతో మంగళవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రారంభించి ఆ కుటుంబంలో ఇంటి కోసం తపించిన కలను నెరవేర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు ఠాకూర్ మాట్లాడుతూ రెండవ విడతలో ఇల్లు లేని వారికి ఇల్లు భూమి ఉన్నవారికి ఇల్లు అలాగే పింఛన్ రాని వారికి పింఛన్లను మంజూరు చేస్తానని, గూడునీడ లేని పేదల బతుకులకు భరోసా కల్పించడమే తన లక్ష్యమని అన్నారు. గ్రామ సర్పంచ్ గద్దల విమల రాజయ్య ఉప సర్పంచ్ చిలుక సాగర్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# జిల్లా అభివృద్ధిలో ఆర్‌డీఓ సేవలు ప్రశంసనీయం

## - మేడారం మహాజాతర విజయవంతంలో కీలక పాత్ర

## - జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 26 : ములుగు జిల్లా అభివృద్ధిలో రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేష్ సేవలు ప్రశంసనీయమని,ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర విజయవంతం కావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.ములుగు జిల్లాలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వెంకటేష్‌కు మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆర్‌డీఓ వెంకటేష్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌డీఓ వెంకటేష్ జిల్లాలో తన విధుల కాలంలో సమర్థవంతమైన పరిపాలన అందించారని ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేశారని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు, రెవెన్యూ పరిపాలన, మేడారం మహాజాతర నిర్వహణ సమయంలో సమన్వయంతో వ్యవహరించి ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులతో సమన్వయం పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని,తన పనితీరుతో సహచర అధికారుల అభిమానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధికి ఆయన అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు.కొత్త స్థానంలో కూడా ఇదే నిబద్ధత, అంకితభావంతో పనిచేసి మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లు మాట్లాడుతూ ఆర్‌డీఓ వెంకటేష్ విధి నిర్వహణలో నియమనిబద్ధత, క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించారని తెలిపారు.రామచంద్రపూర్ భూముల రీసర్వేలో తనకంటూ ప్రత్యేక ముద్రను సంపాదించుకున్నారని, జూనియర్ అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు.మేడారం మహాజాతరలో ప్రోటోకాల్ విధుల్లో సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. వివిధ భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో తన వంతు పాత్ర పోషించారని తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఆర్‌డీఓ వెంకటేష్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో పనిచేసిన అనుభవం తనకు ఎంతో ప్రత్యేకమని అన్నారు. జిల్లా అధికారుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం లభించిందని తెలిపారు. అందరి సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.జిల్లాలో పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. మేడారం మహాజాతరలో విధులు నిర్వహించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన స్థానిక మంత్రి అనసూయ సీతక్కకు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీఓలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మళ్లీ అవకాశం లభిస్తే ములుగు జిల్లాలో సేవలందించడానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. అనంతరం ఆర్‌డీఓ వెంకటేష్‌ను జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్‌డీఓ ప్రతాప్, జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, జూనియర్ అసిస్టెంట్లు, నాలుగవ తరగతి ఉద్యోగులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, మే 26 : నిర్మల్ జిల్లాలో ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా, నిరంతరాయంగా పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం లక్ష్మణచందా మండలంలోని తిరుపల్లి గ్రామంలోని గోదామును కలెక్టర్ సందర్శించి, ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వెంట వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గోదాం మొత్తం నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యం పరిమాణం, అన్లోడింగ్ కోసం వేచి ఉన్న ట్రాక్టర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్యపై ఆరా తీసి, అవసరమైతే మరింత మంది హమాలీలను నియమించి అన్లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. హమాలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సరిత, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

## - దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య - పట్టుదలతో ముందుకు సాగితే దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించగలరు - టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, మే 26 : దివ్యాంగుల సంక్షేమం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి,తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలు దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలు, స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 30 మందికి స్కూటీలు, 15 మంది లబ్ధిదారులకు బ్యాటరీ వీల్ చైర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దివ్యాంగులు స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకువస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల దివ్యాంగులు కూడా ప్రభుత్వ సేవలు సులభంగా పొందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, పట్టుదల, మనోధైర్యం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. దివ్యాంగులు సవ్యాంగులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తూ తమ ప్రత్యేకతను చాటు కుంటున్నారని కొనియాడారు. లక్ష్య సాధనకు కృషి, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని చెప్పారు. దివ్యాంగులు తమలో ఉన్న ప్రతిభను వెలికితీసుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను స్టాఫ్ నర్స్‌గా పనిచేసిన రోజుల్లో లెప్రసీ వార్డులో సేవలు అందించిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, చేసే పనిలో సేవాభావం, నిబద్ధత ఉంటేనే నిజమైన సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం జిల్లా సంక్షేమ శాఖ ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. వారికి అత్యుత్తమ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు, షఫీ, నర్సింలు, రాయకోటి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

## జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, మే 26 : ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లాలోని ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాలకు చెందిన వివాహాలు నిర్వహించే పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, బ్యాండ్ మేళం నిర్వాహకులకు బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.అవగాహన కార్యక్రమం బుధవారం ఉదయం11 గంటలకు ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించ బడుతుందని పేర్కొన్నారు.ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావు పేటమండలా లకు చెందిన వివిధ మతాల మత పెద్దలు, వివాహాలు నిర్వహించే వ్యక్తులు,టెంట్ హౌస్ నిర్వాహకులు,ఫోటోగ్రాఫర్లు, బ్యాండ్ మేళం నిర్వాహకులు తదితరులు తప్పనిసరిగా ఈ అవగాహన సదస్సులో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన, సామాజిక,ఆరోగ్యపరమైన ప్రభావాలపై పూర్తి అవగాహన పొందడంతో పాటు ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా సంక్షేమ అధికారిణి ఆ ప్రకటనలో కోరారు.

# అరుదైన కోలన్ క్యాన్సర్‌కు యశోదలో విజయవంతమైన చికిత్స

## అపెండిక్యులర్ మాస్‌తో బాధపడుతున్న మహిళకు కొత్త జీవితం అందించిన వైద్యులు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 26 : అరుదైన అపెండిక్యులర్ మాస్‌తో కూడిన కోలన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వనపర్తి జిల్లాకు చెందిన 51 ఏళ్ల మహిళకు హైదరాబాద్‌లోని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా చికిత్స అందించి కొత్త జీవితం ప్రసాదించారు. వనపర్తి జిల్లాకు చెందిన సుగురు యాదమ్మ తీవ్రమైన కడుపు నొప్పి, జ్వరం, కడుపులో గడ్డ వంటి సమస్యలతో ఆసుపత్రిలో చేరగా, వైద్య పరీక్షల్లో అపెండిక్యులర్ మాస్‌తో పాటు కోలన్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. ఇది అత్యంత క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధిగా వైద్యులు తెలిపారు. డాక్టర్ సురేందర్ రెడ్డి టీమ్ ఆధ్వర్యంలో రోగికి లాపరోస్కోపిక్ ఎక్స్‌ప్లోరేషన్, అడ్హీజియోలిసిస్, ఒమెంటల్ బయాప్సీ నిర్వహించగా, అనంతరం డాక్టర్ డా. దయాకర్ రావు జీ పర్యవేక్షణలో రైట్ హెమికోలెక్టమీ, ఐలియో-ట్రాన్స్‌వర్స్ అనాస్టమోసిస్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. పెద్దప్రేగులో గడ్డతో పాటు చుట్టుపక్కల భాగాలకు ఇన్ఫ్లమేటరీ మార్పులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి యాంటీబయోటిక్స్, నొప్పి నివారణ చికిత్స, డయాబెటిస్ నియంత్రణతో ప్రత్యేక పర్యవేక్షణ అందించడంతో ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగుపడిందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ దయాకర్ రావు మాట్లాడుతూ, "అపెండిక్యులర్ మాస్ మరియు కోలన్ క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించి సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు. అత్యాధునిక లాపరోస్కోపిక్, ఆంకాలజీ శస్త్రచికిత్సలతో మంచి ఫలితాలు సాధ్యమవుతాయి" అని తెలిపారు. ఈ కేసు ద్వారా అపెండిక్యులర్ మాస్‌తో కూడిన కోలన్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం, అత్యాధునిక లాపరోస్కోపిక్ పరీక్షలు, బయాప్సీ ద్వారా ఖచ్చితమైన నిర్ధారణ చేయడం, క్లిష్టమైన క్యాన్సర్‌కు విజయవంతమైన శస్త్రచికిత్స నిర్వహించడం వంటి అంశాలు మరోసారి వెలుగులోకి వచ్చాయని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది. యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో క్లిష్టమైన క్యాన్సర్ మరియు జీర్ణాశయ సంబంధిత వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

# వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా ఈరపోగు రాజ్‌కుమార్ నియామకం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే 26 : వనపర్తి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఈరపోగు రాజ్‌కుమార్‌ను జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ రాజేందర్ పాల్ గౌతమ్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారా యణ, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ నగరిగారి ప్రీతం నియామక పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఈరపోగు రాజ్‌కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక హక్కుల సాధన, ఎస్సీ వర్గాల బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన తన సేవలను గుర్తించి బాధ్యతాయుతమైన పదవి ఇవ్వడం ఆనందంగా ఉంద న్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించి ప్రోత్సహించిన వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

# చాపకింద నీరులా ఎబోలా వ్యాప్తి !

ఎబోలా వణికిస్తోంది. కరోనా అంత వేగంగా కాకపోయినా మెల్లగా చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో ఇప్పుడు ప్రపంచ దేశాలకు కొత్త తలనొప్పి ప్రారంభం అయ్యింది. ఆఫ్రికా దేశాల నుంచి ఇతర దేశాలకు విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే ప్రపంచ దేశాలు అప్రమత్తం అయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అన్ని దేశాలకు హెచ్చరికలు జారీచేసింది. కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాలకు పాకిన ఎబోలా వందల మందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం చాలా కష్టమని అంత ర్జాతీయ ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనుషులకు సోకే నాలుగు రకాల ఎబోలా వైరస్‌ల్లో బుండి బుగ్యో ఒకటి. దీనిని ఉగాండాలోని ఓ పర్వత ప్రాంతంలో తొలిసారి కనుగొన్నారు. గతంలో రెండుసార్లు మాత్రమే వ్యాపించడంతో అధికారులు పెద్దగా దృష్టిపెట్టలేదు. ఫలితం గా తాజాగా వ్యాపించిన ప్రదేశంలోని ల్యాబ్ పరీక్షల్లో దీనిని గుర్తించే సౌకర్యం లేకపోవడంతో.. గుర్తించేందుకు జాప్యం జరిగింది. మొదటి దీనిని గుర్తించేందుకు నమూనాను వేల మైళ్ల దూరంలో ఉన్న గవర్నమెంట్ రీసెర్చ్ ల్యాబ్‌కు పంపాల్సి వచ్చింది. ఈశాన్య కాంగోలోని యుద్ధ ప్రభావిత ప్రాంతమైన ఉగాండా సరిహద్దుల్లో తొలి ఎబోలా కేసు నమోదైంది. అక్కడ ఒక హెల్త్ వర్కర్ వాంతులు, జ్వరంతో చికిత్స తీసుకొని కొన్ని రోజుల్లోనే మరణించారు. ఆ తర్వాత ఆ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇంటికి తరలించారు. దానిని తాకిన చాలా మందికి కొన్నాళ్లకే ఎబోలా లక్షణాలు బయటపడ్డాయి. వైరస్ సోకిన వారికి కొన్ని వారాలపాటు వ్యాధి లక్షణాలు బయటపడకపోవడంతో ఎక్కువ మందికి సోకే అవకాశం కలుగుతోంది. వ్యాధి వ్యాపించిన ప్రదేశం కాంగోలో ప్రధాన మైనింగ్ కేంద్రం కావడంతో జనాభా రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో 2018లో ఎబోలా వ్యాపించిన సమయంలో దానిని కట్టడి చేయడానికి ఏకంగా రెండేళ్ల సమయం పట్టింది. ఎబోలాలో జైర్ అనే స్ట్రెయిన్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. దీంతో పోలిస్తే బుండిబుగ్యో ఎబోలా వైరస్ కొంచెం నెమ్మదిగానే తన సంఖ్యను పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పశ్చిమాఫ్రికా ప్రాంతంలో 2014లో 11,300 మంది ప్రాణాలు తీసింది జైర్ వేరియంట్. ఇది చరిత్రలోనే అతిపెద్ద ఎబోలా వ్యాప్తి. దీంతో పోలిస్తే బుండిబుగ్యో వేరి యంట్ సోకిన వారిలో 30 మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. కాకపోతే దీనికి ఇప్పటి వరకు ఎలాంటి వ్యాక్సిన్, చికిత్స లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈశాన్య కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. రోజు రోజుకూ మృతులసంఖ్య పెరుగుతుం డటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ బుండిబుగ్యో ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జన్సీగా ప్రకటించింది. ప్రస్తుతం కాంగో, ఉగాండ, దక్షిణ సూడాన్‌లలో వ్యాప్తి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. మరోవైపు భారత ప్రభుత్వం కూడా బుండిబుగ్యో ఎబోలాపై అప్రమత్తమైంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణించవద్దని హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఇపపటివరకు కాంగోలో మొత్తం 867 మందికి ఈ వ్యాధి వ్యాపించగా.. 204 మరణాలు నమోదయ్యాయి. ఎబోలా ఎఫెక్ట్ భారత్‌పైనా పడింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెలాఖరులో అత్యంత ప్రతిష్టాత్మ కంగా జరగాల్సిన నాల్గవ 'ఇండియా–ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుతం కలకలం రేపుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు భారత ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు ముందస్తు జాగ్రత్తగా కేంద్ర ఆరోగ్య శాఖ దేశవ్యాప్తంగా అప్రమత్తత ప్రకటించింది. ముందుగా నిర్దేశిరచిన షెడ్యూల్ ప్రకారం 4వ ఇండియా–ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ మే 28 నుంచి మే 31 వరకు న్యూఢిల్లీలో జరగాల్సి ఉంది. ఈ క్లిష్ట సమయంలో ఆఫ్రికా దేశాలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. 'ఆఫ్రికా సీడీసీ' నేతృత్వంలో జరుగుతున్న ప్రజారోగ్య సన్నద్ధత, అత్యవసర పరిస్థితుల నియంత్రణ ప్రయత్నాలకు భారత్ తన వంతు సాంకేతిక, వైద్య సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేసింది. ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ అంతర్జాతీయ ప్రయాణికులకు కీలకమైన హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారు లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణించి భారత్‌కు వచ్చే వారు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే తమ ఆరోగ్య పరిస్థితిని అధికారులకు నివేదించాలని ఆదేశించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 'హై–రిస్క్'గా వర్గీకరించిన డెమొక్రా టిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. ఎబోలా లక్షణాలు ఉన్నా లేదా బాధితులతో పరిచయం ఉన్నా ప్రయాణికులు స్వచ్ఛందంగా విమానాశ్రయ ఆరోగ్య అధికారులకు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి భారతదేశం లో ఎక్కడా ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. డబ్ల్యూహెచ్‌ఓ సూచనల ప్రకారం ప్రభుత్వం అన్ని ముందస్తు నివారణ చర్యలను తీసుకుంటోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఎబోలా నివారణకు అవసరమైన సన్నద్ధతతో ఉండాలని కేంద్రం ఆదేశించింది. 'ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా ఉంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేం దుకు సిద్ధంగా ఉన్నాం.. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మండని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# "త్యాగానికి ప్రతీక బక్రీద్"



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగలలో ముఖ్యమైనది బక్రీద్ పండగ. త్యాగానికీ, బలిదానానికి ప్రతీకయైన బక్రీద్ (ఈద్–ఉల్–జుహా) పండుగ ప్రతి సంవత్సరం జిల్ హజ్ మాసంలో జరుపుకోవడం అనాదిగా ఆనవాయితీగా వస్తున్నది. బక్రీద్ అంటే "బకర్ ఈద్" అని అర్థం. "బకర్" అంటే జంతువని, "ఈద్" అంటే పండుగని అర్థాలు ఉన్నాయి. జంతువును ఖుర్బాని ఇచ్చే పండుగ కాబట్టి దీనిని "ఈదుల్ ఖుర్బాని" అని కూడా అంటారు. మహ్మదీయుల క్యాలెండర్ ప్రకారం జిల్ హజ్ నెలలో బక్రీద్ పండుగ వస్తుంది. ఇస్లామీయ కేలండర్ లో ఈదుల్ అజ్ హా ఒకే దినంలో వచ్చిననూ, గ్రెగేరియన్ కేలండరులో తేదీలు మారు తాయి. దీనికి కారణం ఇస్లామీయ కేలండర్ చంద్ర మాసాన్ని అనుసరించి , గ్రెగేరియన్ కేలండర్ సూర్య మాసాన్ని అనుసరించి ఉంటుంది. చాంద్ర మాన సంవత్సరం, సూర్య మాన సంవత్సరం కంటే దాదాపు పదకొండు రోజులు తక్కువ. ప్రతి సంవత్సరం ఈదుల్ అజ్ హా ప్రపంచం లోని వివిధ ప్రాంతాలలో రెండు గ్రెగేరియన్ కేలండర్ దినములలో సంభవిస్తుంది. దీని కారణం అంతర్జాతీయ దినరేఖ ననుసరించి వివిధ ప్రాంతాలలో చంద్రవంక వేర్వేరు దినాలలో కాన రావడమే. జిల్ హజ్ నెల పదో రోజున ఈ పండుగ జరుపు కుంటారు. మహ్మదీయులు సంవత్సరాన్ని "హిజ్రీ" అంటారు. హిజ్రీ అంటే వలస పోవడం అని అర్థం. మహ్మద్ ప్రవక్త మక్కా నుంచి మదీనాకు తరలి వెళ్లడాన్ని హిజ్రీగా పేర్కొంటారు. ఏటా జిల్ మాసం (హిజ్రీ క్యాలెండర్ ప్రకారం) 9వ రోజు హజ్ (కాబా ప్రదక్షిణం), మరుసటి రోజున అనగా 10వ నాడు బక్రీద్ (ఈద్–ఉల్–జుహా)లో, ముస్లింలు జరుపు కోవడం సాంప్రదాయంగా ఆచరణలో ఉంది. ఇబ్రహీం త్యాగమయ జీవితాన్ని ఆదర్శంగా గొని, మనిషికున్న త్యాగ భావాన్ని సజీవంగా ఉంచేందుకు ఈ పండుగను భక్తి భావంతో జరుపు కుంటారు. హజ్రత్ ఇబ్రహీం అలైహిసలాం, విగ్రహారాధకుడైన అజర్ ఇంటిలో జన్మించాడు. అజర్ విగ్రహాలను తయారు చేసేవాడు మరియు పురోహితుడు కూడా. బాల్యం నుండీ ఇబ్రహీం ఎల్లప్పుడూ సృష్టికర్తయైన అల్లాహ్ గురించే ఆలోచించే వాడు. దైవ సందేశాన్ని అందజేయ డంలో భాగంగా, ఇబ్రహీం... ఇరాన్ ను వదిలి సిరియా, పాలస్తీనా, ఈజిప్టు మొదలైన ప్రాంతాలలో పర్యటించాడు. ఈ సందర్భంగా ఆయనను అల్లాహ్ కఠిన పరీక్షకు గురిచేశారు. తన అర్ధాంగియైన హాజరా మరియు కుమారుడైన హజ్రత్ ఇస్మాయిల్ అలైహి సలాం ను, త్రాగునీరు కూడా కరువైన భయంకర నిర్జన ఎడారి ప్రాంతంలో వదిలి పెట్టి, ప్రజలకు దైవ సందేశాన్ని అంద జేస్తూ ధార్మిక ప్రచార కార్యక్రమాలలో నిమగ్నమై పోవాలని అల్లాహ్ ఆదేశిస్తారు. అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి, ఆయనే తన కుటుంబాన్ని రక్షించగలరనే పరి పూర్ణ విశ్వాసంతో, భార్యా పిల్లలను వదిలేసి దైవ కార్యార్థం వెళతాడు. ఒకరోజు రాత్రి హజ్రత్ ఇబ్రహీం నిద్రలో ఉండగా, లేకలేక కలిగిన తన ఏకైక కుమారుడైన ఇస్మాయిల్ ను తన స్వహస్తాలతో బలి ఇస్తున్నట్లు కలకంటాడు. దానిని అల్లాహ్ ఆజ్ఞగా భావించి, మరునాడు వంద ఒంటెలను ఖుర్బానీగా సమర్పిస్తాడు. రెండవ రోజు కూడా అదే కలకనగా, తెల్లవారి మరో వంద ఒంటెలను ఖుర్బానీ ఇస్తాడు. ఆరాత్రికూడా అదే కల రావడంతో, అల్లాహ్ తన కిష్టమైన వస్తువునే కోరుతు న్నారని భావించి, తనప్రియాతి ప్రియ మైన కుమారుడు ఇస్మాయిల్ ను ఖుర్బానీగా సమర్పించాలనుకుని , ఈ విషయాన్ని ఇస్మాయిల్ లో ప్రస్తావించగా, అందులకై ఇస్మాయిల్ సంతోషంగా అంగీకరిస్తాడు. బలి ఇవ్వడానికై సర్వం సిద్ధమై, ఇస్మాయిల్ ను పడుకో బెట్టి కత్తితో ఖండించ బోగా, అల్లాహ్ అనుమతి లేనందున కత్తి తన కోసే తత్వాన్ని కోల్పోతుంది. వారి భక్తికి మెచ్చిన అల్లాహ్, స్వర్గం నుండి జిబ్రాయిల్ అలైహి సలాం (దేవదూత) ద్వారా ఇస్మాయిల్ స్థానంలో దుంప (గొర్రె)ను ఉంచి, దానిని వారి త్యాగానికి ప్రతీకగా స్వీకరిస్తారు. ఇదే సాంప్రదా యాచరణ ప్రకారం ప్రతి సంవత్సరం ముస్లింలు త్యాగానికి ప్రతీకగా, ఇబ్రహీం త్యాగాన్ని ఆదర్శంగా గొని, బక్రీద్ నాడు గొర్రెపిల్లను బలి ఇవ్వడం జరుగుతున్నది. మనిషిలోని త్యాగభావాన్ని సజీవంగా ఉంచేందుకు, తమకిష్టమైన వస్తువును త్యాగం చేయాలనే అల్లాహ్ ఆదేశానుసారం, ఏటా పండగ సందర్భంగా గొర్రెను బలి ఇవ్వడం ఆచారంగా మారింది. ఖుర్బానీ గురించి దివ్య ఖురాన్ అనుసారం హృదయాల్లో ఉండే త్యాగ భావం, భయభక్తులు మాత్రమే అల్లాహ్ సన్నిధికి చేరుతాయి. ఖుర్బానీ పశువుల రక్తమాంసాలు చేరవు. అలాగే ఖుర్బానీ ఇచ్చే సమయంలో...దీని ప్రాణాలు సర్వం అల్లాహ్, ఇంకా సమయం వచ్చినపుడు అల్లాహ్ ఒప్పందం కోసం, ప్రేమకోసం ప్రాణాలను సైతం త్యాగం చేస్తామని విశ్వాసాన్ని దృఢ పరుచు కుంటారు.

బక్రీద్ పండుగను వివిధ దేశాలలో వివిధ పేర్లతో జరుపుకుంటారు.



ఈద్ అల్–కబీర్' : (మొరాకో, అల్జీరియా, ట్యునీషియా, ఈజిప్టు, లిబియా దేశాలలో); 'ఫస్కా తమొఖ్వార్త్' : (పశ్చిమ ఆఫ్రికా దేశాలలో); 'బబ్బర్ సల్లాహ్' : (నైజీరియాలో); 'సిద్వైనీ' : (సోమాలియా, కెన్యా , ఇథియోపియాలో); 'బడీ ఈద్' లేదా బక్రీద్ : (భారత దేశం, పాకిస్తాన్ లో); 'వలీయా పెరున్నల్' : (కేరళలో) 'ఖుర్బానీ ఈద్' : (బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాలో); 'పెరునాల్' : (తమిళనాడులో); 'కుర్బాన్ బైరామి' : (టర్కీ, అజర్‌బైజాన్ లో)" ; 'కుర్బాన్ బజ్రామ్' : (బోస్నియా , హెర్జెగోవీనా, అల్బేనియా, కొసావో , బల్గేరియా లో); 'కుర్బాన్ బైరమే' : (తాతారిస్తాన్ లో); 'కుర్బాన్ బైరామ్' : (రష్యా లో); 'కుర్బాన్ ఆయిత్' : (కజకస్తాన్ లో); 'ఈద్ ఎ ఖోర్బాన్' : (ఇరాన్ , ఆఫ్ఘనిస్తాన్ లో); 'లోయే అక్తర్' లేదా 'కుర్బానియే అక్తర్' : (పుష్తో భాషీయులు); 'కుర్బాన్ ఈత్' : (చైనా , ఉయ్ ఘుర్ భాషలో); 'ఈదుల్ అద్ హా' (మలేషియా, సింగపూర్, ఇండోనేషియా , బ్రూనై లో) వివిధ పేర్లతో పిలుస్తారు. ముస్లిం సోదరులు జీవితంలో కనీసం ఒక సారి హజ్ యాత్ర చేయడం, విధిగా నిర్ణయించ బడింది. యాత్ర చేయగల వారు, కాబాదాకా వెళ్ళగలిగే స్తోమత గలవారు, ఆయన గృహానికి వెళ్ళి హజ్ చేస్తారు. దీనిని దాసులపై ఆయనకున్న హక్కుగా భావిస్తారు. త్యాగానికి ప్రతీకయైన బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకుని, ఖుర్బాని మూడు భాగాలుగా చేసి, ఇంటి వారు, బంధువులతో పాటు మూడవ భాగాన్ని పేదలకు పంచి పెడతారు.

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# "నవభారత నిర్మాత పండిత నెహ్రూ"

## మే 27.... జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి



హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు కృషిచేసి సంఘ సంస్కరణ కర్తగా, స్వతంత్ర భారతావని సాంప్రదాయాలు, విధానాల రూపశిల్పిగా, నవభారత నిర్మాతగా, పేరెన్నిక గన్నారు చాచా నెహ్రూ. వివాహం కనీస వయస్సును, 12 నుండి 15 కి పెంచడం, సతులు... పతుల నుండి విడాకులు తీసుకుని ఆస్తి వారసత్వ హక్కు పొందడం, వరకట్న పద్ధతిని చట్టవిరుద్ధం చేయడం, దేశ తొలి ప్రభు త్వాధినేతగా, సమాజ సంస్కరణలలో సఫలీకృతులయ్యారు, జవహర్ లాల్. న్యాయవాదిగా పరిపూర్ణ రాజకీయవేత్తగా, రచయితగా, దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా, భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నెహ్రూ–గాంధీ కుటుంబ అ మూలపురు షుడిగా సుపరిచితుడు అయిన నెహ్రూ, నేటి ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ నగరంలో కాశ్మీరీ బ్రాహ్మణ వంశంలో, ధనిక కుటుంబం లో, ప్రముఖ న్యాయవాది మోతిలాల్ నెహ్రూ, స్వరూప రాణిల తొలి సంతానంగా నవంబర్ 14, 1989లో జన్మించారు. సోదరీమణులైన కృష్ణ విజయలక్ష్మి పండిట్ లతో పాటు, "ఆనంద భవన్" లో ఆంగ్ల సాంప్రదాయ శిష్ట పద్ధతులలో పెరిగారు. బాల్యంలోనే హిందీ, సంస్కృతాలు, భారత సారస్వత గ్రంథాల పఠనా సక్తులు అయినారు. ఇండియన్ సివిల్ సర్వీసులో అర్హత పొందాలని తండ్రి కోరికను అనుసరించి, ఇంగ్లాండ్ నందలి హార్రో వెళ్ళాడు. పాఠశాల విద్య అక్కడ పూర్తిచేసి, 1907లో, కేంబ్రిడ్జ్ లో ప్రవేశ పరీక్ష రాసి, జీవశాస్త్ర అధ్యయనానికి కళాశాలకు వెళ్ళి, 1910లో పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్ర అ అధ్యయనానికి ఇన్నెర్ టెంపుల్ వెళ్లి, 1912లో ఉత్తీర్ణుడై అక్కడే న్యాయవాద వృత్తి చేపట్టాడు. వెనువెంటనే భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. 1919లో జలియన్వాలా బాగ్ దుర్ఘటనకు ప్రభావితుడై, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆకర్షితుడై, సంగ్రామంలో తన శక్తులు లోడ్డుటకు ఉద్యుక్తుడయ్యాడు. మొదట మోతిలాల్ నెహ్రూ కుమారుని నిర్ణయాన్ని వ్యతిరేకించినా, తర్వాత ఆయన సైతం సంగ్రామంలో భాగస్వామి అయినాడు. అనంతరం మహాత్ముని నమ్మిన బంటుగా నెహ్రూ గుర్తింపు పొందాడు. ఆ సమయంలో 9 ఏళ్ళు జీవితం అనుభవించాడు. జీవితం సమయంలోనే 1334 లో "గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 1936 లో తన జీవిత చరిత్ర 1946లో "ది డిస్కవరీ ఆఫ్ ఇండియా" రచనలు పూర్తిచేశాడు తొలిసారిగా గాంధీ నాయకత్వ పోరాటంలో, 1929 లో భారత జాతీయ కాంగ్రెస్ నేతగా, లాహోర్ సమావేశాలకు నాయకత్వం వహించాడు. 1936,1937,1940 లలో, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. యువకునిగా ఉన్న నాటి నుండే జాతీయ కాంగ్రెస్ లో, వామపక్ష భావజాల ప్రభావితుడై, సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జన ఆసక్తుడై, గాంధీ సలహాలతో, ప్రజాకర్షణ గల నేతగా, సంస్కరణవాదిగా స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక నిర్వహించి గాంధీ అనంతరం, రెండవ అగ్రశ్రేణి నాయకుడిగా గుర్తించబడి నాడు.1916లో కాశ్మీరీ బ్రాహ్మణ వంశస్థులు రాలైన కమలా కౌల్ తో వివాహితుడైన నాడు. ఫలితంగా కుమార్తె ఇందిరా ప్రియదర్శిని 19 17 నవంబర్ 19న జన్మించింది. కమలా నెహ్రూ 19 46 లో క్షయ వ్యాధితో మృతి చెందగా, కుమార్తె ఇందిర, సోదరి విజయలక్ష్మిలపై, ఎక్కువగా ఆధార పడడం జరిగింది. 1947 నుండి 64 వరకు దేశ ప్రధానిగా ఉన్న నెహ్రూ, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు లో ప్రధాన పాత్ర పోషించి, 1952 లో దేశ తొలి ప్రధాని గా ఎన్నుకొనబడినాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర్య భారత పతాకాన్ని ఎగరవేసిన తొలి భారతీయుడిగా, గౌరవం దక్కించుకున్న ఘనత ఆయనది. పార్లమెంటరీ తరహాలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛా వాదం, పేద అణగారిన వారి పట్ల అనురాగం, ప్రధానిగా ఆయన రూపొందించిన విధానాలపై ప్రభావం చూపాయి. 1964 మే 27న తన 74వ ఏట పరమపదించాడు. పంచశీల సూత్ర అనువర్తిగా, అలీనోద్యమ స్థాపకులలో ఒకరిగా, యుద్ధానంతర కాల అంతర్జా తీయ ప్రముఖుడిగా, గౌరవసూచకంగా "పండిట్" గా పిలువబడిన నెహ్రు, సుదీర్ఘ పదవీకాలం అనుభవాన్ని రంగరింప చేసుకున్న కూతురు ఇందిర, మనమడు రాజీవ్, ప్రధాని పదవులు పొందడా నికి స్ఫూర్తి పొందా రనాడంలో, రవంతైనా అతిశయోక్తి లేదు.

**వ్యాసకర్త : రామ కిష్టయ్య సంగనభట్ల, 9440595494**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

## ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

వాషింగ్టన్, మే 26 : అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టార్గెట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.



# కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లను అంగీకరించిన కమిషనర్ అరుణ శ్రీ

## - కార్మిక సంఘాల జేఏసీ నాయకుల వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), మే 26 : జేఏసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వడదెబ్బతో మరణించిన మల్లమ్మ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని చేసిన మెరుపు సమ్మె సందర్భంగా సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అరుణ శ్రీ చాంబర్ లో జేఏసీ నాయకులు, కార్మికుల మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన డిమాండ్ నోటీసు పై కూలంకుషంగా చర్చించి వాటన్నింటినీ తొందరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఇందులో ప్రధానంగా మల్లమ్మ కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావలసిన అన్ని రకాల బెనిఫిట్స్ ఇప్పిస్తానని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఇంతకుముందు మరణించిన లేదా పదవి విరమణ పొందిన కార్మికుల కుటుంబాల్లో వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎండ తీవ్రతలు దృష్టిలో పెట్టుకొని పని వేళలు మార్చాలని అడగడంతో ఉదయం నాలుగు గంటల నుండి 10 గంటల వరకు పనిచేయుటకు అంగీకరించారు. దీంతోపాటు కార్మికులకు మంచినీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని కోరడంతో బుధవారం నుండి ఇస్తామని అంగీకరించారు. ఆదివారాలు, మరియు పండగ సెలవులు అమలు చేయాలని కోరడంతో వాటిని అమలు చేయుటకు అంగీకరించారు. పర్మినెంట్, మరియు కాంట్రాక్టు కార్మికులకు మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న బట్టలు,సబ్బులు, కొబ్బరినూనె,చెప్పులు, బెల్లం, 2025 ఫిబ్రవరి నుంచి పెండింగ్లో ఉన్న చీపుర్లు,పారలు, గంపలు,గ్లౌజులు, మాస్కులు వెంటనే ఇవ్వాలని కోరడంతో మూడు,నాలుగు రోజుల్లో ఇవ్వటానికి అంగీకరించడం జరిగింది. రిక్షా కార్మికులకు ఇంటింటికి తిరిగి డబ్బులు వసూలు చేసే విధానం మార్చాలని నేరుగా కాంట్రాక్ట్ కార్మికులకు ఇస్తున్నట్లే వేతనాలు ఇవ్వాలని కోరడంతో వచ్చే కౌన్సిల్ మీటింగులో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఉన్న మున్సిపల్ కమిషనర్ కార్మికులకు ఇచ్చిన ప్రమోషన్లను యధావిధిగా కొనసాగించాలని కోరడంతో దానికి కూడా అంగీకారం తెలిపారు. సొసైటీ పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని కోరడంతో అందుకు అంగీకరించారు. సీనియర్లను కాదని ట్రాక్టర్ల పై పనిచేసే జూనియర్లను సూపర్వైజర్ లుగా నియమించరాదు అని కోరడంతో అందుకు అంగీకరించారు. అదేవిధంగా బయోమెట్రిక్ పనిచేయకపోయినా కార్మికులను బాధ్యులుగా చేసి మస్టర్లలో కోత విధించే విధానం ఆపాలని కోరడంతో వెంటనే నష్టపోయిన అందరివారికి తిరిగి మస్టర్ లు రికవరీ చేయిస్తానని చెప్పడం జరిగింది. ఈ చర్చలలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, బిఆర్ఎస్ మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు నడిపెల్లి మురళీధర్ రావు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం. ఎ. గౌస్ సిఐటియు నాయకులు కిషన్ నాయక్, గుంజ రమణ, బీఆర్ఎస్ నాయకులు వేల్పుల రాయమల్లు,రొడ్డ రాజేందర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.






# ఆర్ఎఫ్సీఎల్ ఉద్యోగ బాధితులతో ఎమ్మెల్యే కార్యాలయ ముట్టడి యత్నం

## - భగ్నం చేసిన పోలీసులు - పోలీసుల అదుపులో మజ్దూర్ యూనియన్ నేత అంబటి నరేష్

## - బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 26 : ఆర్ఎఫ్సీఎల్ ఉద్యోగ బాధితులకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం న్యాయం చేయాలని, దొంగలకు కొమ్ము కాయొద్దని ఆర్ఎఫ్సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు అంబటి నరేష్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్ఎఫ్సీఎల్ ఉద్యోగ బాధితులతో కలిసి అంబటి నరేష్ మాట్లాడుతూ ఆర్ఎఫ్సీఎల్ ఉద్యోగ బాధితులకు న్యాయం చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే, ఇప్పుడు ఆ బాధితుల డబ్బులతో గోదావరి ఒడ్డున కొన్న 18 ఎకరాల భూమికి డీటీసీపీ లే అవుట్ ఇప్పించారని ఆరోపించారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దొంగలకు కొమ్ము కాయకుండా ఆర్ఎఫ్సీఎల్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల డబ్బులతో కొన్న భూమిని అమ్మి వారికి డబ్బులు ఇప్పించాలని, లేదంటే ఆ భూమిని బాధితుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఆర్ఎఫ్సీఎల్ బాధితులకు న్యాయం చేస్తానని చెప్పి ఇప్పుడు అసలు బాధితులే లేరని అంటున్నారని, అందుకే మొదటి విడతగా 100 మంది బాధితుల పేర్లను విడుదల చేస్తున్నానని తెలిపారు. ఈ ఉద్యోగ బాధితులతో కలిసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంకు వెళతామని వెల్లడించారు. అంతకుముందు ఎన్నికల సమయంలో ఆర్ఎఫ్సీఎల్ బాధితుల పక్షాన ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడిన వీడియో చూపించారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో ఆర్ఎఫ్సీఎల్ ఉద్యోగ భాదితులు నేరెళ్ళ సత్యం, ఐత శ్రావణ్, క్రాంతి, రాకేష్, రమేష్, నక్క మల్లేష్, నరేష్, శ్రీధర్, రవి, ఐలమ్మ, వెంకటేష్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ఎఫ్సీఎల్ బాధితులతో కలిసి నరేష్ స్థానిక న్యూ అశోక్ థియేటర్ నుండి రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు నడుచుకుంటూ వెళ్లగా, ఖని చౌరస్తా వద్ద ర్యాలీకి పర్మిషన్ లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులతో కొంత సేపు వాగ్వివాదం అనంతరం పోలీసులు అంబటి నరేష్ ను పోలీస్ వాహనంలో ఎక్కించుకుని స్టేషన్ కు తరలించారు.

# హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయాలి



## - త్వరితగతిన కొనుగోళ్ళు పూర్తయ్యేలా చూడాలి

## - వాహనాలు పెంచాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి

## - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## - ధాన్యం కొనుగోళ్లపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 26 : హమాలీల సంఖ్యను పెంచి, ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సరిపడా సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, సేకరించిన ధాన్యం మిల్లులు, గోదాంలకు తరలించి అన్ లోడింగ్ వేగవంతం చేసి నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ మంగళవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లుల్లో అన్ లోడింగ్ పై కలెక్టర్ ఆరా తీశారు. మిల్లుల వారీగా ఎంతవరకు ధాన్యం అన్ లోడింగ్ చేశారో వివరాలు అడిగి, హమాలీల సంఖ్య పెంచుకునేలా యజమానులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. లక్ష్యానికి మేరకు రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం క్రమంగా పెరిగేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు పడే అవకాశం ఉన్న దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న బస్తాలను వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా తక్షణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టార్పాలిన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. గన్నీ బ్యాగులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుండి హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు. రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం పెంచి, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు.

# నిరుపేదల కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తా

## - ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు - ఖైతలాపూర్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పరిశీలన

## - అమృతనగర్ తండా వాసులకు 62 ఇళ్ల పంపిణీ ఏర్పాట్ల పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





కూకట్పల్లి, మే 26 : కూకట్పల్లి నియోజకవర్గంలోని ఖైతలాపూర్లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. అమృతనగర్ తండాకు చెందిన 62 మంది నిరుపేద కుటుంబాలకు బుధవారం ఇళ్ల పంపిణీ జరగనున్న నేపథ్యంలో అక్కడ చేపట్టిన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర అంశాలను సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో కూకట్పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ చిత్తారమ్మ బస్తీతో పాటు ఖైతలాపూర్లో మొట్టమొదటిసారిగా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టామని గుర్తు చేశారు. గతంలో లాటరీ పద్ధతిలో అమృతనగర్ తండాకు చెందిన 67 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించామని, ప్రస్తుతం మిగిలిన 62 మంది నిరుపేద కుటుంబాలకు కూడా అదే ప్రాంతంలో ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మేలు జరిగే విషయంలో రాజకీయాలకు తావులేకుండా పని చేయాలని తాను ఎప్పుడూ నమ్ముతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిరుపేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీలకతీతంగా ముందుంటానని పేర్కొన్నారు. స్థానికంగా నివసిస్తున్న పేద కుటుంబాలకు 10 శాతం ఇళ్లను కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా విలేకరులకు కూడా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రి శ్రీధర్ బాబులను విజ్ఞప్తి చేశారు. ఫతేనగర్ ప్రాంతంలో అమృతనగర్ తండా వాసులు ఖాళీ చేసిన స్థలాన్ని మళ్లీ వారికి ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మించి తండా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత ( సి ఎస్ ఆర్ ) నిధుల ద్వారా తానే కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని వెల్లడించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. లబ్ధిదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, నీటి సరఫరా, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు బిక్షపతి, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, ఎమ్మార్వో స్వామి, ఇంజనీరింగ్, హౌసింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

## అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, మే 26 : మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు సూచించారు. జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల సాగు నివారణ చర్యలు, విద్యార్థులు, యువత డ్రగ్స్ వినియోగించకుండా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్కు అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వారికి వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా బాధితులకు చికిత్స, మానసిక పరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, విద్యాసంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల్లో టెక్నాలజీ నైపుణ్యాల పెంపుకు ఏఐ, రోబోటిక్స్ శిక్షణ

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, మే 26: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి నిర్వహించిన 'సూపర్ సమ్మర్ కంప్యూటర్, ఏఐ, రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్' ఎంతో ఉపయోగపడిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. టి-ఫైబర్ సహకారంతో ఏప్రిల్ 27 నుంచి ఈ నెల 26 వరకు నెల రోజులపాటు మంథని, పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్ కేంద్రాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 312 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించారు. కంప్యూటర్, ఏఐ, రోబోటిక్స్, డిజిటల్ స్కిల్స్పై ఆరు రోజుల చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన 'పెద్దపల్లి జిల్లా ఏఐ అండ్ రోబోటిక్స్ స్టూడెంట్ షోకేస్-2026'లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు, రోబోటిక్స్ నమూనాలు, ఏఐ ఆధారిత వినూత్న ఆలోచనలు ఆకట్టుకున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య అందించడం లక్ష్యమని, భవిష్యత్తులో ఏఐ, రోబోటిక్స్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించేలా ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిపాలన, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ఊరట.. దేవరకద్రలో మూడు లిఫ్టులకు రూ.4 కోట్లకు పైగా నిధులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, మే, 26 : దేవరకద్ర నియోజకవర్గ రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరి సాగునీటి సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటున్న సరళ సాగర్, కురుమూర్తి రాయ, నెల్విడి ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ. 4 కోట్లకు పైగా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. నియోజకవర్గంలోని ఆయకట్టు రైతులు గత కొంతకాలంగా ఈ లిఫ్టుల మరమ్మ త్తుల కోసం ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. పంటల సీజన్ సమయంలో లిఫ్టులు సక్రమంగా పనిచేయక సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి స్వయంగా లిఫ్టులను పరిశీలించి, పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సరళ సాగర్ లిఫ్ట్ పునరుద్ధరణకు రూ. 1.94 కోట్లు, కురుమూర్తి రాయ లిఫ్ట్కు రూ. 1.45 కోట్లు, నెల్విడి లిఫ్ట్కు రూ. 92 లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, రైతాంగ సమస్యలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే మరమ్మత్తు పనులు ప్రారంభించి, రాబోయే వర్షాకాలానికి ముందే లిఫ్టులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేలా చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ నిధుల మంజూరుతో దేవరకద్ర నియోజకవర్గం లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.




# మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

## - మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత

## - పట్టణ సమైక్య సర్వసభ సమావేశంలో పాల్గొన్న చైర్పర్సన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 26 : మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత పేర్కొన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యచరణలో భాగంగా మంగళవారం కేసముద్రం ఎంపీడీవో కార్యాలయం నందు పట్టణ పేదరిక సంస్థ-మెప్మా ఆధ్వర్యంలో ఓంకారేశ్వర పట్టణ సమైక్య సర్వసభ సమావేశం నిర్వహించబడింది, ఈ కార్యక్రమానికి కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఉపాధి సాధించి కుటుంబాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, సబ్సిడీలు, అందిస్తూ వారి జీవితాల్లో భరోసా కల్పిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ అమలు చేస్తున్న మహిళ సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. శ్రీనివాసరావు, డిఎంసి విజయ, అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి పూలమ్మ, కోశాధికారి శ్యామల, మున్సిపాలిటీ ఆర్పీలు, సమైక్య అధ్యక్షురాలు, మహిళలు పాల్గొన్నారు.

# జన గణన ప్రక్రియను పక్కాగా నిర్వహించాలి

## - హౌస్ లిస్టింగ్ ప్రక్రియను, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని

## - పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




సంగారెడ్డి, మే 26 : జిల్లాలో జన గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. జన గణనలో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను మంగళవారం కంది మండలం ఇంద్రకరన్ గ్రామంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్యూమరేటర్గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగిని ఐడీ కార్డును పరిశీలించి, ఇప్పటివరకు హౌస్ లిస్టింగ్ ఎంత శాతం పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. స్వీయ గణన చేసుకున్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి స్థాయిలో నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. జన గణన కోసం వెళ్లే ప్రతి ఎన్యూమరేటర్ క్యూ.ఆర్ కోడ్తో జారీ చేసిన ఐడీ కార్డును తప్పనిసరిగా ధరించాలని కలెక్టర్ సూచించారు. సెన్సస్ ప్రక్రియ ఎంతో ప్రాధాన్యత కలిగినదని, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు పూర్తి బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, రైస్ మిల్లుకు తరలించిన నిల్వలు, ట్యాబ్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్, రైతుల ఖాతాల్లో జమ చేసిన చెల్లింపుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించి, అక్కడ ఆలస్యం లేకుండా అన్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా చూడాలని, మిల్లుల వద్ద ధాన్యం లోడుతో లారీలు నిలిచిపోకుండా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయి పర్యవేక్షణతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డిటిసిఎస్ విజయలక్ష్మి ఉన్నారు.



## దత్తత ఉత్తర్వులు అందించిన కలెక్టర్ చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, మే 26 : హైదరాబాద్‌కు చెందిన ఓ దంపతులకు తోబుట్టువులైన చిన్నారుల దత్తతకు సంబంధించిన చట్టబద్ధమైన ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన విధానంలోనే దత్తత తీసుకోవాలని సూచించారు. దత్తతకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, శిశుగృహ ఇన్‌చార్జ్ అపూర్వ, ఐసీపీఎస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజాదర్బార్‌ను ప్రజలు వినియోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 26 : ప్రజలకు సంబంధించిన సమస్యలు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు,పింఛను దరఖాస్తులు నేడు జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిస్ అన్నారు. ఓటాయి గ్రామపంచాయతీలో ఉదయం 9 గంటలకు, కొత్తగూడ క్లస్టర్‌లోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు ప్రజాదర్బార్ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరవుతారని, ప్రజలు ఈ కార్యక్రమంలో తమ వినతులను సమర్పించాలని కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

## బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### - మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 26 : జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాలతో మేరకు మేడిపల్లి, భీమారం మండలాల్లోని సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీధర్ రెడ్డి ఉమ్మడి మేడిపల్లి మండల ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రశాంత వాతావర ణంలో జరుపుకోవాలని కోరారు. ఆవుల అక్రమ రవాణా, గోవధ నిషేధం గురించి వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిం చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.



## అత్యవసరం సమయంలో రక్త దానం చేసిన భీమారం యువకులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, మే 26 : సారంగాపూర్ మండలం లక్ష్మీదేవ పల్లె గ్రామానికి చెందిన జొన్నల రాజేశం, వరలక్ష్మిలకు కారు ప్రమాదం జరగగా, వారికి అత్యవసర చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని మెడికవర్ హాస్పిటల్ కు తరలించగా సర్జరీ నిమిత్తం 05 యూనిట్ల బి పాజిటివ్ బ్లడ్ అవసరం అని వైద్యులు సూచించారు. విషయం తెలుసుకున్న భీమారం మండల కేంద్రంలోని యువ నాయకులు చెక్కపల్లి రఘు, మరిపల్లి ఆదిత్య, గంప రితీష్, కరీంనగర్ కు చెందిన అయిత ప్రణీత్ రావులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చెక్కపల్లి రఘు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. వీరికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, హాస్పిటల్ యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ ను బాధితునికి అందజేసిన ఎస్సై

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 26 : గత సంవత్సరం క్రితం తన మొబైల్ ఫోన్ పోయిందని తాండ్రియాల గ్రామానికి చెందిన దేశవేణి రాము కథలాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, అట్టి ఫిర్యాదును సిఈఐఆర్ పోర్టల్ లో నమోదు చేశారు. మంగళవారం అట్టి సెల్ ఫోన్ రికవరీ కాగా, దానిని బాధితునికి అందజేసినట్లు కథలాపూర్ ఎస్సై రవికిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికిరణ్ మాట్లాడుతూ కథలాపూర్ మండల పరిధిలోని ఎవరిదైనా మొబైల్ పోగొట్టుకొన్న ఎడల సిఈఐఆర్ పోర్టల్ నందు నమోదు చేసినా లేదా పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేసినా సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అట్టి సెల్ ఫోను ఆచూకీ కనుక్కుంటామని తెలిపారు.

## కళ్యాణం, సిద్ధోగ మహోత్సవంలో పాల్గొన్న ఏనుగు మనోహర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 26 : బీమారం మండలం గోవిందారం గ్రామంలో జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి - జమదగ్ని కళ్యాణం, సిద్ధోగ మహోత్సవంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు క్యాతం సత్తి రెడ్డి, రాజలింగపేట సర్పంచ్ చారి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదిగిరి అది రెడ్డి, గోవిందారం గ్రామ శాఖ అధ్యక్షుడు ఈరవేణి గంగాధర్, నెల్లుట్ల ప్రభాకర్, గండ్ర సురేందర్ రావు, చీటి దిలీప్ రావు, మాజీ ఎంపీటీసీ రవీందర్ రావు, లోక జలపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలసాని రవి గౌడ్, భూమయ్య, కుంట గంగమల్లయ్య, కుంట వంశీ, కోరేపు మైపాల్, బావు నర్సయ్య, కుంట రాకేష్, కుంట మధు, మద్రి మల్లేష్, కొత్తపెల్లి గంగస్వామి, తోట అనిల్, తోట రెడ్డి, కుంట సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# వరిధాన్యం ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



లక్షేటిపేట, మే 26 రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో గల శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్, శ్రీ సాయి మణికంఠ రైస్ మిల్ లను మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాము, ఇటిక్యాల లోని కొనుగోలు కేంద్రాన్ని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతోపాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసి తరలించిన మొక్కజొన్నలను సైతం గోదాములలో నిలువ చేయాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని ఎసిసి ప్రాంతంలో గల హనుమాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల, బెల్లంపల్లి, తాండూర్ (కోటపల్లి ఇంచార్జ్) తహసిల్దార్లు రఫతుల్లా, కృష్ణ, జ్యోత్స్న లతో కలిసి సందర్శించారు. ప్రభుత్వం రైతుల కొరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తులసి నగర్‌లో నిలిచిపోయిన డ్రైనేజీ పనులు త్వరలో పూర్తి

### కాలనీ వాసులకు మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హామీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కూకట్‌పల్లి, మే 26 : శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో తులసి నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులు గత కొంతకాలంగా నిలిచిపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానికులు డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మంగళవారం తులసి నగర్ కాలనీలో పర్యటించి పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ, తులసి నగర్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నప్పటికీ, అవసరమైన పైపులు సరిపోకపోవడంతో కొంతమేర పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయని తెలిపారు. సమస్యను శేర్లింగంపల్లి ఎమ్మెల్యే, పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే నిర్మాణ పనులను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని, త్వరితగతిన పనులు పూర్తి చేసి కాలనీ వాసుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో డ్రైనేజీ సమస్య వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్ రావు, ఉత్తమ్ రెడ్డి, కృష్ణ గౌడ్, రఘునాథ్ గౌడ్, రాజశేఖర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### - ఎమ్మెల్యే మాధవరం వ్యాఖ్యలపై డా.సత్యం శ్రీరంగం తీవ్ర విమర్శలు
### - ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలని హితవు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, మే 26 : కూకట్‌పల్లి నియోజకవర్గంలో తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు. సోమవారం కూకట్‌పల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణారావు హద్దులు దాటి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "ఇకనైనా పిచ్చి కూతలు కూయడం ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. మీ తాటాక చప్పుళ్లకు భయపడే రోజులు పోయాయి. కాకి కూతలు మానుకుని ప్రజలకు సేవ చేయడం నేర్చుకోండి" అంటూ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు చేయడం సరికాదని, ప్రజలు ఈ విషయాలను గమనించాలని ఆయన కోరారు. "నోటిదురుసు ఉంది కాబట్టి మైక్ దొరికిందని ఏది పడితే అది మాట్లాడడం సరికాదు" అని వ్యాఖ్యానించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసిన ఆయన, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రగతి ప్రస్థానంలో కొత్త అధ్యాయం ప్రారంభమైందని, మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పరిపాలన సౌలభ్యం, వేగవంతమైన అభివృద్ధి లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది ఎన్నికల కోసం చేసే అభివృద్ధి కాదని, నిరంతరం కొనసాగించే అభివృద్ధి ప్రక్రియ కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్ అని డా. సత్యం శ్రీరంగం స్పష్టం చేశారు.

# సూపర్ ఫైటర్స్ కప్‌లో ఖని విద్యార్థుల ప్రతిభ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, మే 26 : కరీంనగర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'సూపర్ ఫైటర్స్ కప్ తెలంగాణ కరాటే టోర్నమెంట్'లో స్థానిక డ్రాగన్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ జిల్లాల నుంచి సుమారు 837 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో ఖని విద్యార్థులు కాటా, కుమితే విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. బ్లాక్ బెల్ట్ సీనియర్స్ కాటా విభాగంలో టింగు జయసాయి చరణ్, గదార్ల సహస్ర బంగారు పతకాలు సాధించి టోర్నమెంట్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఆల్ కలర్ బెల్ట్ విభాగాల్లో సాయి వైష్ణవి, స్పందన, రోనిత్ కుమార్, లాస్య ప్రియ, శ్రీవికసిని, సర్విన్ రెడ్డి, శాశ్రిత్ రెడ్డి, మానస, రూపన్ని, అదిత్రి, అచ్యుత్, యాగ్నేశ్వర్ రెడ్డి, శ్రీహర్షిత్, రిషిత, మహర్ణవి, అశ్వన్, రితిక, శ్రీహర్షిని, సాయి రిషిక్, అభిరా నందన్ తదితరులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించి ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్ ట్రోఫీని అందుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను కోచ్ పసునూటి చందుతో పాటు ఎఫ్ఎస్‌కెఐ ఇండియా చీఫ్ రచ్చ శ్రీనుబాబు, భవాని చంద్, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ ఆరుముల్ల పవన్, పెద్దపల్లి జిల్లా కరాటే స్పోర్ట్స్ దూ అసోసియేషన్ సీనియర్ మాస్టర్స్ పసునూటి శంకర్, కరాటే శ్రీనివాస్, తగరపు శంకర్, ఒడ్డెపల్లి సురేష్, బోయపోతు రాము, మంథని నాగరాజు తదితరులు అభినందించారు.



# సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి : ఏఐటియుసి

### - రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 26 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న అల్పాహారం పథకాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో నిర్వహించిన సంఘం నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా మధిరలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు స్థలం అప్పగించే ప్రక్రియలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మధిర కేంద్రం నుంచే అల్పాహారం, భోజనం సరఫరా చేస్తామని ప్రకటించడం సరైన విధానం కాదన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నారని తెలిపారు. అల్పాహారం పథకాన్ని కూడా స్థానిక వంట కార్మికుల ద్వారానే అమలు చేస్తే విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన ఆహారం అందుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేసి, మధ్యాహ్న భోజనం, అల్పాహారం పథకాలను స్థానిక కార్మికుల ద్వారానే కొనసాగించాలని కోరారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అల్పాహారం పథకానికి సంబంధించిన నిధులను విడుదల చేయకుండా వెళ్లిపోయిందని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సత్తుపల్లి మండల కార్యదర్శి తెలకారపు రామారావు, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహీమ్ మున్నీసా, జిల్లా సమితి సభ్యులు మహాదేవ లక్ష్మి, పూచి సీత, జక్కంపూడి వెంకటలక్ష్మి, పారేపల్లి సత్యవతి, కారం నాగలక్ష్మి, చామకూర సత్యవతి, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, జరీనా, మంగమ్మ, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు పోరాటం చేస్తాం

### శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, మే 26 :రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. 'రైతు గోస..భాజపా భరోసా' బస్సు యాత్ర మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వడపర్తికి చేరుకున్న సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో 25 శాతం కూడా జరగలేదని ఆరోపించారు. దళారుల చేతిలో రైతులు మోసపోతున్నారని విమర్శించారు. కావాలనే కొనుగోళ్లను మూడు వారాలు ఆలస్యం చేశారని, వర్షాలకు ధాన్యం తడిసి పాడైతే ప్రకృతిపై నెపం నెట్టేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కల్లాల్లో ఉన్న చివరి గింజ కొను గోలు అయ్యే వరకు రైతుల తరపున బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రైతులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీ గోదాం నగేష్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, సూర్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆర్జీ-2 కార్మికులకు క్వార్టర్ కౌన్సిలింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, మే 26 : సింగరేణి ఆర్జీ-2 ఏరియా పరిధిలోని యైటింక్లైన్ కాలనీ సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం ఎన్‌సీడబ్ల్యూఏ గ్రూప్-1 ఉద్యోగులకు క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం 463 క్వార్టర్లకు నోటిఫికేషన్ జారీ చేయగా, 30 మంది ఉద్యోగులు హాజరయ్యారని అధికార ప్రతినిధి అరవింద్ రావు (ఏజీఎం పర్సనల్) తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, 21 మందికి క్వార్టర్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మాలోత్ రాముడు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ గంధం సాంబశివరావు, డివైపీఎం వేణుగోపాల్, సివిల్ అధికారిణి సోనియా, జూనియర్ అసిస్టెంట్ శ్రీలేఖ, క్వార్టర్ సెక్షన్ గార్డ్ రాజ్‌కుమార్, ఇంటెలిజెన్స్ గార్డ్ ఓరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ని కలిసిన మాద్రి పృథ్వీరాజ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చెరు, మే 26 : బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గానికి సభ్యత్వ ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర కమిటీ నియమించిన మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ని ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్, బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భం గా పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో తాము కూడా సమర్థవం తంగా పనిచేస్తామని శ్రీనివాస్ కి తెలిపారు. పటాన్‌చెరు జేపీ కాలనీ జిహెచ్ఎంసి పరిధిలోని కాలనీల్లో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో మరింత బలోపేతం అవుతూ విజయకేతనం ఎగురవేస్తుందని, పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కలిసి పనిచేయాలని ఆయన కోరారు.



## నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బండి రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కూకట్‌పల్లి, మే 26 : టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ మరియు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో పుష్పగుచ్ఛం పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు తదితర అంశాలపై కమిషనర్ తో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని బండి రమేష్ సూచించారు. ఇదే సందర్భంగా బుధవారం నియోజకవర్గంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు పర్యటన ఉండనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజా సమస్యలపై అధికార యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కూకట్‌పల్లి అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటామని బండి రమేష్ స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, తూము వేణు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కొప్పుశెట్టి దినేష్, గంధము రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలు సమాజానికి శాపం : అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్

### - అవగాహనతోనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 26 :ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళేశ్వరంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. బాల్య వివాహం చట్టవిరుద్ధమైనదే కాకుండా పిల్లల హక్కులను హరించే సామాజిక దురాచారమని పేర్కొన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, సురక్షిత భవిష్యత్తు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. చట్ట ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం జరగాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాల కారణంగా బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు చదువు మధ్యలోనే నిలిచిపోవడం, గృహ హింస, పేదరికం వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని వివరించారు. "బాల్య వివాహాల నిషేధ చట్టం--2006" ప్రకారం బాల్య వివాహాలు నిర్వహించిన వారిపై రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.1 లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే 1098 చైల్డ్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్ఐ తమాషా రెడ్డి, భరోసా ఎస్ఐ స్వప్న కుమారి, సీడీపీఓ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
### -తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా పర్యవేక్షించాలి




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 26 :జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించి కొనుగోళ్లను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈఓలతో ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంట కోతలు ఇతర జిల్లాలతో పోలిస్తే ఆలస్యంగా జరుగుతున్నందున ఈ నెలాఖరు నాటికి కొనుగోళ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లారీల కొరత ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు స్వచ్ఛందంగా ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలిస్తే ట్రాక్టర్ ఛార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. గోదాముల కొరత తలెత్తకుండా పత్తి మిల్లులను కూడా వినియోగంలోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఏపీఎంలు, పీఏసీఎస్ సీఈఓలు ట్యాబ్ ఎంట్రీలను త్వరితగతిన పూర్తి చేసి ధాన్యాన్ని గోదాములు, రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బందిని నియమించి తహసీల్దార్లు పటిష్ఠ పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వెంటనే కాంటా వేసి గన్నీ సంచుల్లో నింపి టార్పాలిన్‌లతో కప్పి భద్రపరచాలని సూచించారు. గన్నీ సంచులు, టార్పాలిన్‌ల కొరత ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, డీఆర్‌డీఓ బాలకృష్ణ, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ కమిషనర్ సంతృప్తి

### - త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించిన హనుమంతరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 26:సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మంగళవారం పవిత్ర త్రివేణి సంగమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు కమిషనర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి అభిషేకం నిర్వహించగా, పార్వతీ దేవి ఆలయంలో ప్రత్యేక అర్చనలు చేశారు. అర్చక స్వాములు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పుష్కరాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో స్వామివారి దర్శనం త్వరితగతిన జరిగేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్న దృష్ట్యా పరిశుభ్రత, భద్రత, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏడీసీ ఎం. కృష్ణవేణి, ఆర్‌జేసీ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ ఆర్. సునీత, ఆలయ ఈవో ఎస్. మహేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి పంచాయతీ కార్యాలయాలు కీలకం

### - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
### - గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 26 :గ్రామాభివృద్ధిలో గ్రామ పంచాయతీ కార్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలం చింతకుంట రామయ్యపల్లి గ్రామంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పరిపాలన మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా ఉండేందుకు పంచాయతీ కార్యాలయాలు ఉపయోగపడతాయని తెలిపారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు ముఖ్య భూమిక పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మటిక సుజాత-రవీందర్, పంచాయతీరాజ్ ఈఈ, మండల తహసీల్దార్, ఎంపీడీఓ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుట్ల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మధువంశీ, పంచాయతీరాజ్ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి మల్లీశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 26 :బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించేందుకు మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఐడీఓసీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "స్నేహ బాలల హక్కుల సదస్సు--మాక్ పార్లమెంట్" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు మంచి లక్ష్యాలతో ముందుకు సాగి సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారి విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ, డీడబ్ల్యూఓ మల్లీశ్వరి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల అభివృద్ధికి మరో ముందడుగు

### - ప్రగతి నగర్‌లో విఓ భవన నిర్మాణానికి భూమిపూజ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 26 :మహిళా సంఘాల అభివృద్ధి, గ్రామీణ మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలం ప్రగతి నగర్‌లో మహిళా సంఘాల కోసం నిర్మించనున్న విఓ (విలేజ్ ఆర్గనైజేషన్) భవనానికి మంగళవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాల నిర్మాణ కార్యక్రమం చేపట్టగా, అంబేద్కర్ నగర్ క్రాంతి విఓ, ప్రగతి నగర్ వణితావాణి విఓలకు సంబంధించిన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రగతి నగర్‌లో గౌరవ సర్పంచ్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, ఉప సర్పంచ్ ఎడుకొండలరావు చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాధి అవకాశాల పెంపుకు విఓ భవనాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, పొదుపు కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలకు ఈ భవనాలు కేంద్రాలుగా మారనున్నాయని పేర్కొన్నారు. పీఆర్ ఏఈ సాయి నిర్మాణ పనుల వివరాలను వెల్లడిస్తూ నాణ్యతతో, సమయపాలన పాటిస్తూ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామ పెద్దలు నరసింహస్వామి, నవకుమార్, శ్యామ్, గోదా చెన్నారావు, లాజర్, రాంబాబు, మారయ్య, వెంకటేశ్వరరావు, రాము, శ్రీను తదితరులు కార్యక్రమాన్ని అభినందించారు. మహిళా సంఘాల సభ్యులు కృష్ణవేణి, పద్మ, ప్రమీల, సుప్రియ, మారతి, మరియమ్మ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక భవనం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇప్పటి వరకు సమావేశాల నిర్వహణకు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇకపై కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించుకోగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కేవీ సుబ్బారావు, సీసీలు ఎస్. ప్రసాదరావు, పి. కృష్ణ, ఎస్కే షబ్బీర్, ఎం. ప్రసాద్, ఆర్. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో సీఎంపీఎఫ్ఓ సేవలు పునరుద్ధరణ : వేణు మాధవ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26:జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ) సేవలు మళ్లీ పునరుద్ధరించబడటం బొగ్గు గని పెన్షనర్లకు ఊరటనిచ్చిందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని పెన్షనర్లు ప్రతి సంవత్సరం తమ జీవన ధృవీకరణ పత్రాలను "జీవన్ ప్రమాణ్" యాప్ ద్వారా మొబైల్ ఫోన్లు లేదా మీ సేవా కేంద్రాల ద్వారా సమర్పిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఇటీవల సాంకేతిక సమస్యల కారణంగా జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో సీఎంపీఎఫ్ఓ సేవలు కనిపించకపోవడంతో అనేక మంది పెన్షనర్లు ఆన్‌లైన్‌లో తమ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ సమస్యను బొగ్గు శాఖ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇప్పుడు సీఎంపీఎఫ్ఓ సేవలు మళ్లీ జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చినట్లు సమాచారం అందిందని వెల్లడించారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని పెన్షనర్లు మునుపటిలాగే జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా సులభంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేకంగా నవంబర్-2026లో పెన్షనర్లు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసిన కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ అధికారులకు పెన్షనర్ల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వేణు మాధవ్ పేర్కొన్నారు.

# స్టేట్ లెవెల్ డాన్స్ పోటీల్లో ప్రతిభ చాటిన న్యూ టాలెంట్ డాన్స్ అకాడమీ చిన్నారులు

### - జూనియర్ విభాగంలో సెకండ్ ప్రైజ్‌లు సాధించి సత్తా చాటిన విద్యార్థులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 26 :హనుమకొండలో ఫిలిం కొరియోగ్రాఫర్ ప్రశాంత్ మాస్టర్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ లెవెల్ డాన్స్ కాంపిటీషన్‌లో న్యూ టాలెంట్ డాన్స్ అకాడమీ చిన్నారులు ప్రతిభ కనబరిచి సెకండ్ ప్రైజ్‌లు సాధించారు. జూనియర్ విభాగంలో నిర్వహించిన వెస్ట్రన్ డాన్స్ పోటీల్లో శనిగరపు రంజిత్ ద్వితీయ బహుమతి గెలుచుకోగా, ఫోక్ డాన్స్ డ్యూయట్ రౌండ్‌లో రామిల్ల నాగ శ్రీనిధి, అన్విక జంట సెకండ్ ప్రైజ్ సాధించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సతీమణి సుమలత విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం న్యూ టాలెంట్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్ రామిల్ల రాకేష్ మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రశాంత్ మాస్టర్‌కు, ముఖ్య అతిథిగా విచ్చేసిన సుమలతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి పొంగులేటి చొరవతోనే పాల్వంచ భూసమస్యలకు పరిష్కారం : కొత్వాల

### కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సమస్యలకు శాశ్వత పరిష్కారం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, మే 26 :రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు, చొరవతోనే పాల్వంచ ప్రాంతంలోని భూసమస్యలకు పరిష్కారం దిశగా చర్యలు వేగంగా సాగుతున్నాయని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ ప్రాంతానికి చెందిన 2వ డివిజన్ ప్రశాంతినగర్, 45వ డివిజన్ కొమ్ముగూడెం, 31వ డివిజన్ పాలకొయ్య తండా, 32వ డివిజన్ గాంధీనగర్ (నవభారత్) ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ స్థాయి సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ప్రభుత్వం భూభారతి చట్టం ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. పాల్వంచ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 999, 817, 727, 444 సర్వే నంబర్ల భూసమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. పేద ప్రజల సమస్యలకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే పరిష్కారం చూపగలదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు మాలంపాటి భవిత, దంతేబోయిన నరేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండం వెంకన్న గౌడ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు నూకల రంగారావు, పీ. నరహరి, కాంగ్రెస్ నాయకులు మాలోత్ కోటి నాయక్, మాలంపాటి కిరణ్, చంటి, భరత్, దప్పు రాము తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ఆలయ చైర్మన్ మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి

### కాటారం డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్ డిమాండ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, మే 26 :మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణల నేపథ్యంలో కాళేశ్వరం ముక్తీశ్వర ఆలయ చైర్మన్ మోహన్ శర్మ మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని కాటారం డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం దేవస్థానం చైర్మన్ ప్రవర్తన మహిళా లోకం అసహ్యాంచుకునే విధంగా ఉందని ఆరోపించారు. వెంటనే మహిళలను గౌరవిస్తూ బేషరతుగా క్షమాపణ కోరాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఆలయాల్లో సేవ చేయడానికి వచ్చే మహిళల్లో అధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బహుజన వర్గాలకు చెందిన వారేనని పేర్కొన్నారు. వారిని చిన్నచూపు చూస్తూ దురుసుగా ప్రవర్తించారనే అంశాలు పత్రికా కథనాల ద్వారా వెలుగులోకి వచ్చాయని అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎండోమెంట్ శాఖ కమిషనర్ స్పందించి మహిళలపై దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ చైర్మన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆలయ చైర్మన్‌ను రక్షిస్తున్నారంటూ కూడా ఆయన ఆరోపించారు. కాళేశ్వరం వంటి దక్షిణ కాశీగా పేరొందిన పవిత్రక్షేత్రంలో ఇటువంటి వివాదాలకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జక్కు శ్రావణ్ కోరారు.

# రాత్రి వేళల్లో కూడా మొక్కజొన్న అన్‌లోడింగ్ కొనసాగించాలి

### - ఖమ్మం జిల్లా కలెక్టర్ అంకిత్ - ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 26 :మొక్కజొన్న అన్‌లోడింగ్ ప్రక్రియలో జాప్యం లేకుండా రాత్రి సమయంలో కూడా పనులు కొనసాగేలా చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. అలాగే ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారు చెలకలో ఉన్న మొక్కజొన్న నిల్వ గోడౌన్‌ను, అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. బంగారు చెలక గోడౌన్‌లో అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, లారీల నుంచి మొక్కజొన్నను వేగంగా దిగుమతి చేసి నిల్వ చేయాలని సూచించారు. గోడౌన్‌లో 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అధికారులు వివరించారు. సుజాతనగర్, కొత్తగూడెం, టేకులపల్లి, ఇల్లందు, చర్ల, బూర్గంపాడు, ఆళ్లపల్లి, గుండాల తదితర మండలాల నుంచి మొక్కజొన్న ఇక్కడికి తరలివస్తోందని తెలిపారు. అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా రాత్రివేళల్లో కూడా పనులు కొనసాగించేలా తగిన లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అదనపు హమాలీలను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. మొక్కజొన్న బస్తాలను భద్రంగా నిల్వ చేయడంతో పాటు పూర్తి నిల్వ సామర్థ్యాన్ని వినియోగించుకునేలా అధిక ఎత్తులో పేర్చాలని సూచించారు. హమాలీలతో మాట్లాడిన కలెక్టర్ ఒక్కో లారీ అన్‌లోడింగ్‌కు పట్టే సమయం, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి తాగునీరు సహా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన పనులను పరిశీలించిన కలెక్టర్, గత ఏడాది మేలో ప్రారంభమైన పనులు ఇంకా పూర్తికాకపోవడంపై



అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ఆలస్యానికి గల కారణాలను నివేదించాలని, జాప్యానికి కారణమైన కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 కోట్ల వ్యయంతో మహిళా సాధికారత కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని, ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు అనువుగా భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ శిరీష, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.26 వేల కనీస వేతనం అమలు చేసే వరకు పోరాటం కొనసాగించాలి : మల్లూరు చంద్రశేఖర్

### - ఐకేపీ వీఓఏల సమ్మెకు సీఐటీయూ మద్దతు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, మే 26 :ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె మంగళవారానికి 9వ రోజుకు చేరుకోగా, వారి న్యాయమైన డిమాండ్లకు సీఐటీయూ సంఘీభావం ప్రకటించింది. కనీస వేతనంగా నెలకు రూ. 26 వేలు అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఐక్యంగా కొనసాగించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఐకేపీ వీఓఏలకు కనీస వేతనాలు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని వీఓఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని మల్లూరు చంద్రశేఖర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, అర్హులైన వారికి సీసీలు, అకౌంటెంట్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కనీస వేతనాల పెంపులో స్పష్టత లేదని, అది కేవలం పారిశ్రామిక కార్మికులకు మాత్రమే వర్తించేలా నిర్ణయం తీసుకోవడం అన్యాయమని విమర్శించారు. వీఓఏల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని, సీఐటీయూ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ఈ పోరాటానికి పూర్తి మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాటూరి మణి, వరకా శృంగారం, జయలక్ష్మి, వరలక్ష్మి, దేవమణి, ప్రసాద్, రాధాకృష్ణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# ఎండ తీవ్రత నుంచి రక్షణకు సిబ్బంది జాగ్రత్తలు పాటించాలి

### - భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

### - కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 26 :రహదారులపై విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది వేసవి ఎండల తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయం కొత్తగూడెంలో కొత్తగూడెం సబ్ డివిజన్ అధికారులతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పెట్రోలింగ్, గస్తీ తదితర విధులు నిర్వహించే సిబ్బంది సమ్మర్ కిట్లు వెంట తీసుకెళ్లాలని, డీహైడ్రేషన్‌కు గురికాకుండా తరచూ మంచినీరు తాగుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజాసేవతో పాటు సిబ్బంది ఆరోగ్య రక్షణ కూడా ముఖ్యమని పేర్కొన్నారు. రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేలా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువుల అక్రమ రవాణా నివారణకు చెక్‌పోస్టుల వద్ద గస్తీని మరింత పెంచాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్లలో నమోదైన పెండింగ్ కేసులను సమగ్రంగా దర్యాప్తు చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజల్లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, కరుణాకర్, ప్రతాప్, ఇంద్రసేనారెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

### మృతుడు మచిలీపట్నానికి చెందిన తోట రాంబాబుగా గుర్తింపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 26:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బర్లీ ఫీట్ ఏరియాలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మృతుడు మచిలీపట్నానికి చెందిన తోట రాంబాబు (సుమారు 50-55 సంవత్సరాలు)గా పోలీసులు గుర్తించారు. స్థానిక సమాచారం ప్రకారం తోట రాంబాబు కొత్తగూడెంలోని రైస్ గ్రాండ్‌లో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో పని ముగించుకుని ఝాన్సీ ఆసుపత్రి సమీపంలోని తన నివాస గదికి వెళ్తుండగా మెట్ల వద్ద అపస్మారక స్థితిలో పడిపోయినట్లు తెలిసింది. స్థానికులు వెంటనే ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై మంగళవారం ఉదయం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. మృతుడు చామన చాయ రంగులో ఉండి, మెడలో జంధ్యం ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి పూర్తి వివరాలు తెలిసిన వారు 8712682017 (ఐఓపీ), 8712682020 (ఎస్ఐ-2) నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# రైతు గోస--బీజేపీ భరోసా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### - బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కాటారం, మే 26 :బీజేపీ రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "రైతు గోస-బీజేపీ భరోసా" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ వడ్ల కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీజేపీ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల బృందం బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు కాటారం మండలంలోని కొత్తపల్లికి చేరుకునే బీజేపీ బృందం అక్కడి ఐకేపీ కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడనుందని చెప్పారు. అనంతరం కాటారం శివారులో ఉన్న మార్కెట్ యార్డ్‌ను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకోనున్నట్లు వెల్లడించారు. వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యంలో అనవసర కట్టింగ్‌లు చేయకుండా పూర్తి స్థాయిలో తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

# పాము కాటుకు గురై యువకుడు మృతి





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 26 :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో పాము కాటుకు గురైన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన విషాదం నింపింది. మణుగూరు రాజుపేట గ్రామానికి చెందిన ఆగోలు నరసింహారావు (30)కు ఊర్ల (రక్త) పింజర పాము కాటు వేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలోకి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయడం చట్టరీత్యా నేరం : చందూలాల్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 26 :వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయకుండా భూమిలో కలియదున్నాలని భద్రాద్రి జిల్లా ఇల్లందు వ్యవసాయ సంచాలకులు జి. చందూలాల్ రైతులకు సూచించారు. వ్యవసాయ అవశేషాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా అది చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. మంగళవారం టేకులపల్లి మండల పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పంట అవశేషాలను భూమిలో కలియదున్నడం ద్వారా నేల సారవంతం అవుతుందని, భూసారం మెరుగుపడి అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. రైతులు పంట అవశేషాలను సేంద్రియ పదార్థాలుగా వినియోగించి భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్. అన్నపూర్ణ, ఏఈఓలు శ్రావణి, విశాల, రైతులు పాల్గొన్నారు.

# వ్యవసాయ వ్యర్థాలను కాల్చటం చట్టరీత్యా నేరం

### వ్యవసాయ సంచాలకులు చందూలాల్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, మే 26 :పంట అవశేషాలను కాల్చివేయకుండా భూమిలో కలియదున్నాలని భద్రాద్రి జిల్లా ఇల్లందు వ్యవసాయ సంచాలకులు జి. చందూలాల్ రైతులకు సూచించారు. వ్యవసాయ వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా అది చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. మంగళవారం టేకులపల్లి మండల పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ వ్యర్థాలను భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం మెరుగుపడటంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. పంట అవశేషాలను సేంద్రియ ఎరువులుగా వినియోగించడం వల్ల నేల సారవంతం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్. అన్నపూర్ణ, ఏఈఓలు శ్రావణి, విశాల, రైతులు పాల్గొన్నారు.

# కుక్కకాటుతో మహిళ మృతి చెందడం బాధాకరం

### - సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

### - బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, మే 26: కుక్కకాటుతో మహిళ మృతి చెందడం అత్యంత బాధాకరమని, బాధిత నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఎస్సీ కాలనీ, చాటివారిగూడెం గ్రామపంచాయతీకి చెందిన మారె రాములమ్మ (55) కుక్కకాటుతో మృతి చెందగా, మంగళవారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కకాట్ల కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని కోరారు. రాములమ్మ మృతి పట్ల గాఢ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా మృతురాలి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతిబసు, పిచ్చయ్య, మిరియాల రాము, లక్ష్మయ్య, జాన్సన్, క్రాంతి, రాజేష్, కళ్యాణ్, జ్ఞానముత్యం తదితరులు నివాళులర్పించారు.

# ఆరోగ్యం



## అరటి తొక్కను పారేస్తున్నారా? ఈ అద్భుత ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదలరు!

పేదవాడి అమృతంగా అరటిపండును చెబుతారు. తక్కువ ధరలో అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉండే అరటిపండు మన ఆరోగ్యానికి చేసే మేలు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే సాఘధారణంగా మనం అరటికాయను తినేసి దాని తొక్కను పడేస్తుంటాం. దాదాపు అందరూ చేసే పనే ఇది. కానీ, మీరు పనికిరానిదిగా భావించి పారేస్తున్న ఆ తొక్కలో ఎన్నో ఆరోగ్య రహస్యాలు, సౌందర్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని మీకు తెలుసా? ఆయుర్వేదం నుంచి ఆధునిక శాస్త్రవేత్తల వరకు అరటి తొక్కలోని ఔషధ గుణాలను గుర్తించారు. పోషకాల గని అరటి తొక్క అరటి తొక్క ఒక పోషకాల గని. ఇందులో ఫైబర్, పొటాషియం, విటమిన్ %దీ%6, విటమిన్ %జ%, మెగ్నీషియం, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ కలిసి మన శరీరాన్ని ఒక కవచంలా కాపాడతాయి. జీర్ణవ్యవస్థను పటిష్టం చేయడం నుంచి రక్తపోటుని అదుపులో ఉంచడం, రోగనిరోధక శక్తిని పెంచడం దాకా అరటి తొక్క కీలక పాత్ర పోషిస్తుంది.

ఆరోగ్యానికి అండగా గుండెకు రక్షణ: అరటి తొక్కలో ఉండే కరిగే ఫైబర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ (%ూణూ%) లెవల్స్ ను తగ్గించడంలో సహాయపడుతుంది. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తుంది. మీ గుండె పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే అరటి తొక్కను మీ ఆహారంలో చేర్చుకోవడం గురించి ఆలోచించవచ్చు. షుగర్ పేషెంట్లకు వరం: అరటి తొక్కలోని ఫైబర్, రక్తంలోకి చక్కెర శోషణ ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది. ఇది రక్తంలో షుగర్ లెవల్స్ సడెన్ గా పెరగకుండా నియంత్రించడంలో సహాయపడుతుంది, ఇది షుగర్ పేషెంట్లకు చాలా ప్రయోజనకరం. బరువు తగ్గడంలో సహాయం: బరువు తగ్గాలనుకునే వారికి అరటి తొక్క మేలు చేస్తుంది. ఇందులో అధికంగా ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను ఎక్కువసేపు కలిగిస్తుంది. ఇది అతిగా తినడాన్ని నియంత్రిస్తుంది, జీవక్రియ రేటును పెంచి, శరీరంలో కొవ్వు కరిగే ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

అందాన్ని ఇనుమడింపజేస్తుంది కేవలం ఆరోగ్యానికే కాదు మీ అందాన్ని రెట్టింపు చేయడంలో కూడా అరటి తొక్క ముందుంటుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు చర్మానికి, జుట్టుకు అద్భుతంగా పనిచేస్తాయి. అరటి తొక్క లోపలి భాగాన్ని ముఖంపై సున్నితంగా రుద్దడం వల్ల మొటిమలు, మచ్చలు, నల్లటి వలయాలు తగ్గుముఖం పడతాయి. తొక్కను మెత్తగా పేస్ట్ చేసి జుట్టుకు పట్టిస్తే చుండ్రు సమస్య దూరమై, జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. ఎలా తినాలి? అయితే అరటి తొక్కను నేరుగా తినకూడదు. దానిపై పురుగుమందుల అవశేషాలు, మైనపు పూతలు ఉండే అవకాశం ఉంటుంది కాబట్టి ఉపయోగించే ముందు తొక్కను గోరువెచ్చని ఉప్పు నీటిలో శుభ్రంగా కడగాలి. తర్వాత కొన్ని నిమిషాల పాటు ఉడికించడం లేదా ఆవిరిపై ఉంచడం వల్ల అది మెత్తబడి, చేదుదనం తగ్గుతుంది. ఈ ఉడికించిన తొక్కను మీరు స్మూతీలలో, కూరలలో, చట్నీలలో లేదా టీ రూపంలో కూడా తీసుకోవచ్చు.

## నవరాత్రి స్పెషల్..10 నిమిషాల్లో అమ్మవారికి ప్రీతికరమైన బాదం మఖానా ఖీర్..

ఈ ఏడాది అక్టోబర్ 2న దసరా పండుగను సెలబ్రేట్ చేసుకుంటారు. దసరా పండుగలో మొదటి తొమ్మిది రోజులను నవరాత్రులు అంటారు. ఈ తొమ్మిది రోజులు దుర్గాదేవి తొమ్మిది రూపాలను (శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి) అలంకరించి పూజిస్తారు. ఈ ఏడాది దేవీ శరన్నవరాత్రులు ఎంతో శుభప్రదమైన రోజుల్లో ప్రారంభం కానున్నాయి. శరన్నవరాత్రులు 22 సెప్టెంబర్ 2025, సోమవారం నుంచి ప్రారంభమై.. 30 సెప్టెంబర్ 2025, మంగళవారం వరకు జరుగుతాయి. శరన్నవరాత్రి ఉత్సవాల శోభ దేశమంతటా వెల్లివిరుస్తోంది. తొమ్మిది రోజుల పాటు దుర్గామాతను నవ రూపాల్లో ఆరాధిస్తూ, ప్రతి ఇల్లూ భక్తిశ్రద్ధలతో నిండిపోతుంది. ఈ పవిత్రమైన రోజుల్లో ఉపవాస దీక్ష చేపట్టడం ఒక ముఖ్యమైన సంప్రదాయం. అయితే ఉపవాసం అంటే కేవలం ఆహారం మానెయ్యడమే కాదు, అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పించి, వాటిని ప్రసాదంగా స్వీకరించడం కూడా అందులో భాగమే. ఉపవాస సమయంలో ఏం తినాలి, అమ్మవారికి తేలికగా ఏం నైవేద్యం పెట్టాలి అని ఆలోచిస్తున్నారా? అయితే బాదం మఖానా ఖీర్ చేయండి. ఇది కేవలం 10-15 నిమిషాల్లో సిద్ధమైపోతుంది. ఇది దుర్గాదేవికి అత్యంత ప్రీతికరమైన నైవేద్యాలలో ఒకటిగా భావిస్తారు. ఈ ఖీర్ రుచికి అమోఘంగా ఉండటమే కాకుండా, ఉపవాస సమయంలో శరీరానికి కావలసిన శక్తిని కూడా అందిస్తుంది. బాదం మఖానా ఖీర్ ఎలా చేసుకోవాలో ఇక్కడ చూడండి.



కావాల్సిన పదార్థాలు -పాలు (చిక్కటివి) - అర లీటరు -తామర గింజలు (మఖానా) - ఒక కప్పు -బాదం పప్పులు - 15-20 -నెయ్యి - ఒక టేబుల్ స్పూన్ -పంచదార - మీ రుచికి సరిపడా - కుంకుమ పువ్వు - చిటికెడు -యాలకుల పొడి - అర టీస్పూన్.

తయారీ విధానం -ముందుగా మందపాటి అడుగున్న బాండీలిలో నెయ్యి వేసి వేడిచేయాలి. నెయ్యి కరిగాక మఖానా, బాదం పప్పులు వేసి అవి బంగారు వర్ణంలోకి మారి, కమ్మటి వాసన వచ్చేవరకు సన్నని మంటపై వేయించుకోవాలి. వాటిని ఒక ప్లేట్లోకి తీసుకుని చల్లారనివ్వాలి. -ఇప్పుడు అదే బాండీలిలో పాలు పోసి అందులో కుంకుమపువ్వు రేకులు వేసి మరిగించాలి. పాలు ఒక పొంగు వచ్చాక, మంట




తగ్గించి, అడుగంటకుండా గరిటెతో కలుపుతూ ఉండాలి. పాలు కొద్దిగా చిక్కబడుతున్నప్పుడు, అందులో పంచదార వేసి పూర్తిగా కరిగే వరకు కలపాలి. తర్వాత వేయించి పెట్టుకున్న మఖానా, బాదం పలుకులను పాలలో వేయాలి. మఖానా మెత్తబడి, పాలు మరింత చిక్కగా అయ్యేంత వరకు సుమారు 5-7 నిమిషాలు ఉడికించాలి. చివరగా యాలకుల పొడి వేసి బాగా కలిపి స్టవ్ ఆఫ్ చేయాలి. అంతే నోరూరించే వేడివేడి బాదం మఖానా ఖీర్ రెడీ. దీనిపై సన్నగా తరిగినబాదం,పిస్తా పలుకులతో అలంకరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించండి. -ఈ ఖీర్ ను వేడిగా లేదా చల్లగా ఎలా తీసుకున్నా అద్భుతంగా ఉంటుంది.

## నోరూరించే వైట్ మటన్ కుర్మా.. పూరీ,చపాతీలోకి అబ్బో కేక అంతే..



వీకెండ్ వస్తే చాలు చాలా ఇళ్లలో మటన్ ఘుమఘుమలు మొదలవుతాయి. అయితే ఎప్పుడూ చేసుకునే రొటీన్ మటన్ కూరతో విసుగొచ్చిందా? ఈసారి మీ రుచిని ఒక మెట్టు పైకి తీసుకెళ్లే సరికొత్త వంటకాన్ని ప్రయత్నించాలనుకుంటున్నారా? అయితే రెస్టారెంట్ స్టైల్ లో ఉండే వైట్ మటన్ కుర్మా ఓ సారి ట్రై చేసి చూడండి. మసాలాలు, జీడిపప్పు, బాదంల క్రీమీ టెక్స్చర్ తో, మృదువుగా ఉడికిన మటన్ ముక్కలతో ఈ కుర్మా రుచి అమోఘం. దీని తయారీ కూడా చాలా సులభం. వేడివేడి నాన్ లు, చపాతీలు, పుల్కాలు,పూరీ, బిర్యానీతో దీనిని తింటుంటే ఆ అనుభూతి మాటల్లో చెప్పలేనిది. రెస్టారెంట్ స్టైల్ లో వైట్ మటన్ కుర్మా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

**కావలసిన పదార్థాలు మటన్ ఉడికించడానికి: -మటన్:** అర కిలో -అనాసపువ్వు: 1 -దాల్చిన చెక్క: 1 అంగుళం ముక్క -జాపత్రి: కొద్దిగా -పచ్చిమిర్చి: 1 -అల్లం వెల్లుల్లి పేస్ట్: అర టేబుల్ స్పూన్ -నీరు: తగినంత మసాలా పేస్ట్ కోసం: -నూనె: 3 టేబుల్ స్పూన్లు -ఉల్లిపాయలు: 2 -జీడిపప్పు: 20 -బాదం: 10 -ధనియాల పొడి: పావు టేబుల్ స్పూన్ -పచ్చిమిర్చి: 2 -పాలు: 100 మి.లీ -గట్టి పెరుగు: 2 టేబుల్ స్పూన్లు కుర్మా తయారీకి: -: 3 టేబుల్ స్పూన్లు -బిర్యానీ ఆకులు: 2 -దాల్చిన చెక్క: 2 చిన్న ముక్కలు -లవంగాలు: 5 -కసూరి మేతి: కొద్దిగా -అల్లం వెల్లుల్లి పేస్ట్: 1 టేబుల్ స్పూన్ -గట్టి పెరుగు: 100 మి.లీ -పాలు: 100 మి.లీ -మిరియాల పొడి: అర టేబుల్ స్పూన్ -నిమ్మరసం: సగం చెక్క -ఉప్పు: రుచికి సరిపడా -కొత్తిమీర, పుదీనా: కొద్దిగా (సన్నగా తరిగినవి).

తయారీ విధానం -ముందుగా శుభ్రం చేసుకున్న మటన్ ను ప్రెషర్ కుక్కర్ లో వేయండి. అందులోనే అనాసపువ్వు, దాల్చిన చెక్క, జాపత్రి, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ముక్కలు మునిగే వరకు నీరు పోసి 8-10 విజిల్స్ వచ్చేదాకా ఉడికించి పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు మసాలా పేస్ట్ కోసం బాండీలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి మారే వరకు వేయించి, చల్లారనివ్వండి.-చల్లారిన ఉల్లిపాయలను మిక్సీ జార్ లో వేసి, జీడిపప్పు, బాదం, ధనియాల పొడి, పచ్చిమిర్చి, పాలు, పెరుగు వేసి మెత్తని పేస్ట్ లా గ్రైండ్ చేసుకోండి. -ఇప్పుడు కుర్మా కోసం మరో మందపాటి గిన్నెలో నూనె వేడి చేసి బిర్యానీ ఆకులు, దాల్చిన చెక్క, లవంగాలు వేసి చిటపటలాడనివ్వండి. కసూరి మేతిని కూడా నలిపి వేసి వేయించండి. తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించి 100 మి.లీ పెరుగు వేసి నూనె పైకి తేలేదాకా కలపండి. -ఇప్పుడు ఉడికించిన మటన్ ను నీళ్లతో సహా అందులో వేసి గ్రైండ్ చేసుకున్న మసాలా పేస్ట్, మిగిలిన పాలు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి. -గిన్నెపై మూత పెట్టి సన్నని మంట మీద 15-20 నిమిషాలు లేదా గ్రేవీ చిక్కబడి నూనె పైకి తేలే వరకు ఉడికించండి. -చివరగా మిరియాల పొడి, తరిగిన కొత్తిమీర, పుదీనా, నిమ్మరసం వేసి బాగా కలిపి స్టవ్ ఆఫ్ చేయండి. అంతే నోరూరించే క్రీమీ వైట్ మటన్ కుర్మా రెడీ.

## ఉడుపి హొటల్ స్పెషల్..కమ్మనైన,కారమైన తన్నీ చట్నీ.. ఇంట్లోనే ఎలా చేసుకోవాలంటే

రోజూ ఉదయాన్నే చేసే ఇడ్లీకి ఎప్పుడూ ఒకేరకమైన కొబ్బరి చట్నీ చేసి విసుగు చెందారా? మీ కుటుంబ సభ్యులు కూడా కొత్త రుచి కోసం ఎదురుచూస్తున్నారా? అయితే ఈసారి మీ వంటగదిలో ఓ చిన్న మ్యాజిక్ చేసి, కర్ణాటకలోని ప్రసిద్ధ ఉడుపి హొటళ్లలో వడ్డించే అసలైన తన్నీ చట్నీని ప్రయత్నించండి. దీనిని నీరు చట్నీ అని మనం పిలుస్తుంటాం.



తన్నీ అంటే నీళ్లు. పేరుకు తగ్గట్టే ఈ చట్నీ కాస్త పల్చగా, కమ్మటి కొబ్బరి రుచితో, పచ్చిమిర్చి ఘాటుతో, నోరూరించే తాళింపు సువాసనతో అద్భుతంగా ఉంటుంది. ఈ చట్నీ ఒక్కసారి రుచి చూశారంటే మామూలుగా తినే ఇడ్లీల కన్నా కచ్చితంగా రెండు ఎక్కువ తింటారు. అంతటి రుచి దీని సొంతం. ఆ ఘుమఘుమలాడే చట్నీ ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

కావలసిన పదార్థాలు నూనె - 1 టేబుల్ స్పూన్ పచ్చిమిర్చి - 6 (మీ కారానికి తగినట్టు) కరివేపాకు - ఒక రెమ్మ జీడిపప్పు - 2 టేబుల్ స్పూన్లు వేరుశనగపప్పు - 2 టేబుల్ స్పూన్లు పచ్చి కొబ్బరి తురుము - అర కప్పు అల్లం - అర అంగుళం ముక్క చింతపండు - చిన్న నిమ్మకాయంత ఉప్పు - రుచికి సరిపడా కొత్తిమీర - కొద్దిగా నీరు - అవసరమైనంత తాళింపు కోసం: కొబ్బరి నూనె - 2 టేబుల్ స్పూన్లు ఆవాలు - 1 టీస్పూన్ మినపప్పు - 1 టీస్పూన్ జీలకర్ర - పావు టీస్పూన్ కరివేపాకు - ఒక రెమ్మ ఎండు మిర్చి - 1.

తయారీ విధానం -ముందుగా స్టవ్ మీద బాండీ పెట్టి నూనె వేసి వేడి చేయండి. నూనె వేడెక్కాక పచ్చిమిర్చి, కరివేపాకు వేసి చిటపటలాడే వరకు వేయించాలి.-ఇప్పుడు అందులోనే జీడిపప్పు, వేరుశనగపప్పు వేసి మంచి సువాసన వస్తూ దోరగా బంగారు రంగులోకి మారే వరకు వేయించి, స్టవ్ ఆపి చల్లారనివ్వాలి. -చల్లారిన ఈ మిశ్రమాన్ని ఒక మిక్సీ జార్ లోకి తీసుకోండి. దానికి పచ్చి కొబ్బరి తురుము, అల్లం ముక్క, చింతపండు, రుచికి సరిపడా ఉప్పు, తాజా కొత్తిమీర జోడించండి. కొద్దిగా నీళ్లు పోసి మెత్తని ముద్దలా రుబ్బుకోవాలి. -ఇప్పుడు ఈ రుబ్బిన చట్నీని ఒక గిన్నెలోకి మార్చి సుమారు ఒక కప్పు నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ చట్నీ ప్రత్యేకతే దాని పల్చటిదనం, కాబట్టి జారుగా ఉండేలా చూసుకోండి.

-చివరిగా తాళింపు కోసం చిన్న పాన్ లో కొబ్బరి నూనె వేడి చేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర వేసి చిటపటలాడనివ్వండి. ఆ తర్వాత ఎండుమిర్చి, కరివేపాకు వేసి వేయించి, ఈ ఘుమఘుమలాడే తాళింపును చట్నీపై వేసి కలపండి. అంతే కమ్మనైన, కారమైన ఉడుపి హొటల్ స్టైల్ తన్నీ చట్నీ రెడీ.

# సినిమా న్యూస్



## కేరళ ట్రెడిషనల్ లుక్ లో దర్శనమిచ్చిన మీనాక్షి!

మీనాక్షి చౌదరి.. కుర్రకారు క్రష్ గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈ చిన్నది.. ఈ మధ్యకాలంలో ఒకవైపు వరుస అవకాశాలు అందుకుంటూనే.. మరొకవైపు సోషల్ మీడియా వేదికగా అభిమానులను అలరిస్తోంది. 1996 మార్చి 5న పంచ్ కులా హర్యానాలో జన్మించిన ఈమె.. పంజాబ్ లోని నేషనల్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ లో డెంటల్ సర్జరీ కోర్సు పూర్తి చేసింది. ఇక తర్వాత నటనరంగం వైపు ఆసక్తితో మొదట మోడల్ గా మారింది. అలా మయన్మార్ - యాంగోన్ లో జరిగిన మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018 అందాల పోటీలలో పాల్గొని మొదటి రన్నరప్ గా నిలిచిన ఈమె..ఆ తర్వాత ఫెమినా మిస్ ఇండియా 2018లో మిస్ గ్రాండ్ కిరీటాన్ని దక్కించుకొని.. అదే ఏడాది మిస్ ఇండియా పేజెంట్ టైటిల్ ని కూడా దక్కించుకుంది. మోడల్ గా తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంటున్న సమయంలోనే.. 2019 లో హిందీ సినిమా అప్ స్టార్ట్ లు అనే చిత్రంలో హీరో స్నేహితురాలి పాత్ర ద్వారా వెండితెరకు పరిచయమైన ఈమె.. 2021లో అక్కినేని హీరో సుశాంత్ ప్రధాన పాత్రలో ఎస్ దర్శన్ దర్శకత్వం వహించిన ఇచ్చట వాహనములు నిలపరాదు సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే అందరిని ఆకట్టుకున్న ఈమెకు మాత్రం గుర్తింపు వచ్చింది హిట్ : ది సెకండ్ కేస్ మూవీ అనే చెప్పాలి. ఇక ఈ సినిమాలో అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె 2024 లో గుంటూరు కారం సినిమాతో సంక్రాంతి బరిలో నిలిచి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అదే ఏడాది లక్కీ భాస్కర్ సినిమాలో నటించి మరో విజయాన్ని అందుకున్న ఈమె.. ఆ తర్వాత వరుసగా మట్కా, మెకానిక్ రాఖీ , సంక్రాంతికి వస్తున్నాం వంటి చిత్రాలు చేసి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఈ ఏడాది అనగనగా ఒక రాజు సినిమాతో మరో సంక్రాంతి బ్లాక్ బస్టర్ విజయాన్ని తన ఖాతాలో వేసుకొని సంక్రాంతి హీరోయిన్గా పేరు దక్కించుకుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో నాగచైతన్యతో వృషకర్మ సినిమాలో నటిస్తున్న మీనాక్షి.. అలాగే మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట మల్లిడి కాంబినేషన్లో వస్తున్న విశ్వంభర సినిమాలో నటిస్తోంది. అలాగే కార్తీ 30 మూవీ తో పాటు ఫోర్స్ 3 అనే హిందీ చిత్రంలో కూడా నటిస్తోంది.



ఇలా ఒకవైపు వరుస సినిమాలలో నటిస్తూ బిజీగా ఉన్న ఈమె మరొకవైపు ఇన్స్టాగ్రామ్ వేదికగా అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.ఈ క్రమంలోనే తాజాగా క్లాసిక్ కేరళ కసవు చీర ధరించి ట్రెడిషనల్ లుక్ లో మరింత అందంగా ఆకట్టుకుంది. లేత తెలుపు/ క్రీమ్ కలర్ కాటన్ బేస్ కి మెరిసే గోల్డెన్ జరీ అంచు జతచేసిన చీరను కట్టుకొని చాలా సాంప్రదాయంగా కనిపించింది . ఆకుపచ్చ రంగు కలిగిన ఆఫ్ బ్లౌజును ధరించిన ఈమె.. ఈ ట్రెడిషనల్ లుక్ లో అభిమానులను మరింత గా ఆకట్టుకుంది. మొత్తానికి అయితే కేరళ ట్రెడిషనల్ లుక్ లో మీనాక్షి ఒదిగిపోయింది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. పైగా మీనాక్షి ఈ ఫోటోలకు క్యాప్షన్ గా "ట్రెండ్ కి తగ్గట్టు వెళ్తున్నాను" అంటూ కామెంట్లు చేసింది.

## చీరకట్టులో సీత అందాలు.. నాకోసమే డిజైన్ చేశారేమో అంటూ!



నాటితరం ఆడియన్స్ లో టాలీవుడ్ జానకమ్మ అంటే అంజలీదేవి గుర్తొచ్చినట్టు.. నేటితరం యువతకు టాలీవుడ్ సీత అంటే వెంటనే గుర్తొచ్చే పేరు మృణాల్ ఠాకూర్.. హను రాఘవపూడి దర్శక త్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా నేరుగా తెలుగులో చేసిన సీతారామం సినిమాలో సీతామహాలక్ష్మి పాత్రలో నటించి ఒదిగిపోయింది. కట్టుబొట్టు అచ్చు మన ఇంటి అమ్మాయిలా కనిపించి అందరి హృద యాలను దోచుకుంది . ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లోనే పాన్ ఇండియా సెలబ్రిటీ అయిపోయిన ఈమె.. కుర్రకారు క్రష్ గా మారిపోయింది. ముఖ్యంగా ఈ సినిమా విడుదలైన సమయంలో చాలామంది అబ్బాయిలు తమ కాబోయే అమ్మాయి ఇలాగే ఉండాలని కోరుకున్న రోజులు కూడా ఉన్నాయి. అలా ఒక్క సినిమాతో ఒక్క పాత్రతో అందరి హృదయాలను దోచుకుంది. అలాంటి ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్ అని తేడా లేకుండా వరుసగా సినిమాలలో నటిస్తూనే మరొకవైపు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ మరింత బిజీగా మారిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా మరో ఔట్ఫిట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది .ఇన్స్టాగ్రామ్ వేదికగా హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన చీర కట్టుకొని వయ్యారంగా ఫోటోలకు ఫోజులిచ్చింది. ప్రముఖ డిజైనర్ అర్పిత మెహతా డిజైన్ చేసిన లేత ఆకుపచ్చ రంగు ఎంబ్రాయిడరీ చీర ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్లో అదే ఎంబ్రాయిడరీతో డిజైన్ చేసిన బ్లౌజు ధరించి తన అవుట్ ఫిట్ తో తన లుక్ ను ఫుల్ ఫీల్ చేసుకుంది. ట్రైబ్ అమ్రపాలి జువెలరీతో తన స్టైల్ ను మరింత పెంచుకున్న ఈమె ను ఇంత అందంగా మార్చింది మాత్రం స్నేహల్ అనే చెప్పాలి. ఇక ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ దీపాలి డియోకర్ నేతృత్వంలో తన జుట్టును మరింత అందంగా తీర్చిదిద్దుకున్న ఈమెకి మిస్ బ్లెండర్ మేకప్ అద్దింది. అలా మొత్తానికైతే మృనాల్ ఠాకూర్ లేటెస్ట్ ఔట్ ఫిట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా రేడియంట్ స్కిన్ తగ్గట్టు ఎలిగేంట్ లుక్ ప్రేక్షకులను విపరీతంగా మెప్పిస్తుంది. పైగా ఈ ఫోటోల కింద క్యాప్షన్ గా ఈ అద్భుతమైన చీరను నాకోసమే డిజైన్ చేశారు అంటూ క్యాప్షన్ జోడించింది..మృణాల్ ఠాకూర్ విషయానికి వస్తే.. 2012లో ముజ్సే కుచ్ కేహేతి అనే హిందీ సీరియల్ ద్వారా నటన రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. 2014లో విట్టి దండు అనే మరాఠీ చిత్రం ద్వారా నటిగా ఇండస్ట్రీకి పరిచయమైంది. ఇక తర్వాత హిందీ , తెలుగు సినిమాలలో నటించడం మొదలుపెట్టింది. సీతారామం సినిమా తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ చిత్రాలలో నటించిన మృణాల్.. ఈ ఏడాది డెకాయిట్ సినిమాలో నటించి మంచి విజయాన్ని అందుకుంది.. ప్రస్తుతం అల్లు అర్జున్ 22వ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుంది. అలాగే హిందీలో రెండు చిత్రాలలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఏది ఏమైనా ఇలా ఒకవైపు సినిమా షూటింగ్ లతో బిజీగా ఉంటూనే మరొకవైపు ఇలా వరుసగా గ్లామర్ వలకబోస్తూ ఆడియన్స్ను కట్టిపడేసే ప్రయత్నం చేస్తోంది.

## ఒకే ఫ్రేమ్ లో గ్లోబల్ బ్యూటీ క్వీన్స్!




అగ్ర నటీనటులు ఒకే వేదికపైకి రావడం అభిమానుల్లో ప్రత్యేకమైన ఉత్సాహాన్ని నింపుతుంది. ముఖ్యంగా గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటీమణులు స్థానిక స్టార్ల కుటుంబాలతో ఆత్మీయంగా గడపడం అనేది సోషల్ మీడియా యుగంలో సరికొత్త చర్చలకు దారితీస్తోంది. ఇలాంటి పరిణామాలు వృత్తిపరంగానే పరిమితం కాకుండా పరిశ్రమల మధ్య ఉండే సాన్నిహిత్యాన్ని.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రతిబింబిస్తాయి. ఇటీవల హైదరాబాద్ వేదికగా జరిగిన ఓ ఆసక్తికర సంఘటన ఇందుకు చక్కటి ఉదాహరణ.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నటి ప్రియాంక చోప్రా, సూపర్ స్టార్ మహేష్ కుటుంబంతో కలిసి సమయాన్ని గడిపడం ఇంట్రెస్టింగ్. నగరంలోని ప్రముఖ మల్టీప్లెక్స్ ఏఎంబీ సినిమాస్ సందర్శన సందర్భంగా మహేష్ సతీమణి నమ్రతా శిరోద్కర్, కుమార్తె సితార ఘట్టమనేనిలతో కలిసి ప్రియాంక సందడి చేశారు. వీరంతా కలిసి దిగిన ఫోటోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ తో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ భేటీ వెనుక మరో ఆసక్తికరమైన కోణం కూడా ఉంది. ప్రియాంక చోప్రా - నమ్రతా శిరోద్కర్ సినిమా రంగంలోకి అడుగుపెట్టక ముందే అంతర్జాతీయ బ్యూటీ పోటీల వేదికలపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన వారే. దశాబ్దాల క్రితం మోడలింగ్ రంగంలో రాణించారు. అనంతరం సినిమా అనే ప్రపంచంలో తమదైన ముద్ర వేసారు.అయితే నటిగా పీసీ అంతర్జాతీయ స్థాయికి చేరుకోగా నమ్రత మాత్రం ఇల్లాలుగా మారి మహేష్ ఇంటి బాధ్యతలు చూసుకున్నారు. చాలా కాలం తర్వాత ఇద్దరు ఒకే ఫ్రేమ్లో కనిపించడం.. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇది చూసిన నెటిజన్లు వీరికిగ్లోబల్ బ్యూటీ క్వీన్స్ అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇద్దరు కలిసిన వేళ ముంబై ముచ్చట్లు పెట్టుకుని ఉంటారు. కెరీర్ ఆరంభంలో ఎలా ఉన్నాం? ఇప్పుడెలా ఉన్నాం? జీవితంలో ఎలాంటి మార్పులొచ్చాయన్నది స్పష్టంగా కనిపిస్తోన్న వేళ ఆమాటలకు హద్దే ఉండదు. అయితే ప్రియాంక చోప్రా ఇంతలా హైదరాబాద్లో సమయం గడపడానికి గల ప్రధాన కారణం -వారణాసి- అన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ గర్వించదగ్గ దిగ్గర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న -వారణాసి- చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రంలో ప్రియాంక మందాకిని అనే విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్ర షూటింగ్ షెడ్యూల్ కోసం ఆమె నగరంలోనే ఉంటున్నారు. భారీ బడ్జెట్తో సైన్స్ ఫిక్షన్ - టైమ్-ట్రావెల్ అంశాలతో రూపొందుతున్న వారణాసి చిత్రంపై యావత్ భారత సినీ ప్రపంచంలో భారీ అంచనాలు నెలకొన్నాయి. -ఆర్ఆర్ఆర్- వంటి అంతర్జాతీయ విజయం తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న ప్రాజెక్ట్ కావడంతో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక ఆసక్తి ఉంది. ఇలాంటి ప్రతిష్టాత్మక చిత్రాలు విభిన్న భాషలకు చెందిన మేటి నటులను ఒకచోట చేర్చడమే కాకుండా భారతీయ సినిమా స్థాయిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు దోహదపడుతున్నాయి.

## గెటప్ తో షాకివ్వనున్న మాస్ మహారాజా

మాస్ మహారాజా రవితేజ మరోసారి తన డిఫరెంట్ స్క్రీన్ ప్రెజెన్స్తో ప్రేక్షకులను ఆశ్చర్యపరచేందుకు సిద్ధమవుతున్నారనే వార్త ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. ఇప్పటికే ఎన్నో సినిమాల్లో విభిన్న గెటప్స్, ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్తో అభిమానులను అలరించిన రవితేజ, ఇప్పుడు ఇరుముడి సినిమాలో పూర్తిగా కొత్త లుక్లో కనిపించనున్నట్టు సమాచారం. ముఖ్యంగా ఈ సినిమాలో ఒక కీలకమైన ఎపిసోడ్లో ఆయన వృద్ధుడి పాత్రలో కనిపించబోతున్నారనే టాక్ ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తోంది. ఈ వార్త బయటకు రావడంతో సోషల్ మీడియాలో రవితేజ అభిమానులు భారీగా స్పందిస్తున్నారు. మాస్ మహారాజా మరోసారి రిస్క్ తీసుకుంటున్నాడు, ఈ గెటప్ సినిమాకే హైలైట్ అవుతుందంటూ కామెంట్లు చేస్తున్నారు. గతంలో విక్రమార్కుడు, రాజా ది గ్రేట్, డిస్కో రాజా, క్రాక్ వంటి సినిమాల్లో తన ఎనర్జీతో పాటూ ప్రత్యేకమైన లుక్స్తో ఆకట్టుకున్న రవితేజ, ఇప్పుడు ఇరుముడిలో మరింత కొత్త గెటప్ లో కనిపించనున్నారనే ఆసక్తి పెరుగుతోంది. ఇరుముడి



సినిమాను యంగ్ డైరెక్టర్ శివ నిర్వాణ తెరకెక్కిస్తున్నారు. ఎమోషన్స్ ను బలంగా చూపించడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన శివ నిర్వాణ, ఈసారి రవితేజ కోసం పూర్తిగా భిన్నమైన కథను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఇరుముడి కథలో ఎమోషన్స్, యాక్షన్, కుటుంబ సంబంధాల మేళవింపు ఉండబోతుందని సమాచారం.

# ఎసిబి పట్టుబడ్డ మరో అవినీతి అధికారి

## - పదివేల లంచం తీసుకుంటుండగా సర్వేయర్ పట్టివేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జోగులాంబ గద్వాల, మే 26 : ఎసిబికి మరో అవినీతి అవినీతి అధికారి పట్టుబడ్డాడు. భూముల సర్వే చేయడానికి ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకుంటూ జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తన భూమిని సర్వే చేయాల్సిందిగా మండల సర్వేయర్ బ్రహ్మయ్యను బాధితుడు ఆశ్రయించగా రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో పక్కా వ్యూహం మేరకు పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, ఆయనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కోర్టుకు తరలించనున్నారు. అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా వదిలేది లేదని అధికారులు హెచ్చరించారు.

# ఎబోలాపై ఆందోళన అవసరం లేదు

మొదటిపేజీ తరువాయి

చేశారు. 108 అంబులెన్స్‌లను 24 గంటలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. అన్ని ప్రభుత్వాసుపత్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. న్ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్ కచ్చితంగా అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులను ఈ సందర్భంగా మంత్రి హెచ్చరించారు. ప్రజారోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.

# తెలంగాణలో అవినీతి రాజ్యం

మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో – సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

మొదటిపేజీ తరువాయి

యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

మొదటిపేజీ తరువాయి

ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా–శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే

## - అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి - సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, మే 26 : భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఎఎస్ ఆదేశించారు.

ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫఏసీ) జి.ఎస్. చారితో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సవిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ పక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సవిక్షిస్తూ, మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ?యనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ పక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్ల మ్యాపింగ్ పక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పక్రియ నిర్వహణలో పాలుపంచుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.

# మంత్రి జూపల్లి ఆదేశాలతో అన్‌లోడింగ్ సమస్య

## మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నాగర్ కర్నూల్, మే 26 : మంత్రి జూపల్లి ఆదేశాలకు భయపడి అధికారులు నాగర్ కర్నూల్ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తాడూర్ మండలం పరిధిలోని ఇంద్రకల్ గ్రామ శివారులోని మణికంఠ కాటన్ మిల్లు గోదాం దగ్గర మొక్కజొన్న, ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్,పరిస్థితిని ఆయన తనిఖీ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న అన్‌లోడింగ్ సమస్యను తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నేరుగా గోదాంకు వెళ్లి రైతుల ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన మొక్కజొన్న ధాన్యం అన్‌లోడ్ చేయకుండా కేవలం మంత్రి జూపల్లి ఆదేశాలతో కొల్లాపూర్‌కు చెందిన దళారుల ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కొల్లాపూర్‌కు చెందిన 30 లారీల ధాన్యం అన్‌లోడ్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం దళారుల వ్యవస్థకు మద్దతిస్తుందని తెలిపారు. రైతుల పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల వివక్షత చూపితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గోదాం వద్ద ఉన్న రైతులకు, డ్రైవర్స్‌కు స్వయంగా భోజనం తెప్పించి పెట్టారు. ఆయన వెంట పలువురు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కర్నాటకలో అధికార మార్పిడిపై చర్చించలేదు

## - నాయకత్వ మార్పు ఊహాగానాలన్నీ అవాస్తవం - రాజ్యసభ ఎన్నికలు, కౌన్సిల్ ఎన్నికలపైనే చర్చించాం - కర్నాటకంపై కాంగ్రెస్ పెద్దల సమావేశంపై కెసి వేణుగోపాల్ వివరణ

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)



న్యూఢిల్లీ, మే 26 : కర్ణాటకలో అధికార మార్పిడికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ సమావేశంలో ఎలాంటి చర్చా జరగలేదని కేసీ వేణుగోపాల్ అన్నారు. త్వరలో జరుగనున్న కర్ణాటక రాజ్యసభ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలపైనే సమావేశంలో చర్చ జరిగినట్టు చెప్పారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కాంగ్రెస్ అధిష్టానం మంగళవారంనాడు జరిపిన ఉన్నత స్థాయి సమావేశం ముగిసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనతరం కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, 'కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. ఈ సమావేశంలో కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశాలే చర్చించాం. కర్ణాటక నుంచి రాజ్యసభ ఎన్నికలు, కౌన్సిల్ ఎన్నికల్లో అనుసరిం చాల్సిన వ్యూహాలను చర్చించాం' అని చెప్పారు. చర్చలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కర్ణాటక ఇన్‌చార్జి, తాను పాల్గొన్నట్టు తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా రాజ్యసభ సీట్ల ఎన్నికలను ప్రకటించారని, దానిపైనే ఈరోజు చర్చించామని, తక్కినవన్నీ ఊహాగానాలేనని వివరించారు. కాంగ్రెస్ 2023లో కర్ణాటకలో అధికారం చేపట్టినప్పటి నుంచి శివకుమార్‌కు పదోన్నతిపై పలుమార్లు ఆయన వర్గం నేతలు డిమాండ్ చేస్తూ వచ్చారు. అధికారం పంపకాలపై ముఖ్యమంత్రి ఎన్నికకు ముందే ఒక అవగాహన ఉందని నేతలు చెబుతున్నారు. అయితే సిద్ధరామయ్య ఆ వాదనలను తోసిపుచ్చారు. ఐదేళ్లూ తాను అధికారంలో ఉంటానని, అయితే పార్టీ నిర్ణయానికి తాను, శివకుమార్ కట్టుబడి ఉంటామని పలుమార్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లను ఢిల్లీకి రమ్మని పార్టీ అగ్రనాయకత్వం పిలవడంతో నాయకత్వ మార్పిడి అంశం మరోసారి ప్రచారంలోకి వచ్చింది.

# చొరబాటు దారులూ పారిపోండి

మొదటిపేజీ తరువాయి

బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 'ప్రభుత్వం చర్యలు తీసుకోకముందే పారిపోండి' అంటూ ముఖ్యమంత్రి తాజాగా హెచ్చరించారు. బంగ్లాదేశ్ అక్రమ వలసదారుల అంశంపై మాట్లాడుతూ, కొత్త చట్టంతో కాకుండా ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించ డానికి సిద్ధంగా ఉన్నట్టు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని తెలిపారు. బంగ్లా అక్రమ చొరబాటుదారులను జైళ్లకు పంపవద్దని తాను పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. 'వారికి మనమెందుకు ఆతిథ్యం ఇవ్వాలని దేశ వనరులను మనం ఎందుకు దుర్వినియోగం చేయాలి. చొరబాటుదారులు ఏమైనా మన అల్లుళ్లా?' అని ప్రశ్నించారు. బంగ్లా పౌరులు స్వచ్ఛందంగా, శీఘ్రంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్దఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం 'గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి' అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# మహిళల భద్రత, గౌరవానికి ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

మంత్రి సీతక్క చెప్పారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

# ఎసిబి పట్టుబడ్డ మహిళా తహసిల్దార్

మొదటిపేజీ తరువాయి

భూమిలో నాలా కన్వర్షన్ కోసం దరఖా స్తును ఆమోదించాలని తహసీల్దార్‌ను కోరగా అందుకు రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. దీంతో ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం మధ్యాహ్నం కార్యాలయంలో తహసీల్దార్ ప్రైవేట్ డ్రైవర్ నాగేష్‌కు రూ.2లక్షలు అందజేశాడు. డ్రైవర్ ఆ డబ్బును తహసీల్దార్ సుచరితకు ఇస్తుండగానే మాటు వేసిన ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచం డబ్బును పట్టుకు న్నారు. ఆమెతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

# గవర్నర్‌ను కలిసిన టిఆర్‌ఎస్ అధినేత కవిత

మొదటిపేజీ తరువాయి

వికారా బాద్ జిల్లా కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ బాధితులతో కలిసి గవర్నర్‌ను కలిశామని చెప్పారు. వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితు లందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని కోరామన్నారు. కడ్లా పూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు జారీ చేసిన భూసేకరణ నోటీసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు తదితర సమస్యలపై బాధితులతో కలిసి గవర్నర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. న్యాయం జరగక పోతే మళ్లీ పోరాట బాట పడతామని కవిత చెప్పారు.

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్‌ఎంసి విభజన

మొదటిపేజీ తరువాయి

సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

మొదటిపేజీ తరువాయి

మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా 'రైతు గోస – బీజేపీ భరోసా' పేరుతో యాత్రలు నిర్వహిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# ఎండల తీవ్రత మరింత పెరుగుదల

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఆదివారం ఒక్కరోజే దాదాపు 42 మంది మృతి చెందారు. ఒక్క వరంగల్‌లోనే అత్యధికంగా 20మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 మంది, కరీంనగర్‌లో 8 మంది, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మృత్యువాతపడ్డారు. రాబోయే రోజుల్లో కూడా 43 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు హెచ్చరించారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టగా, సాయంత్రం మాత్రం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిశాయని వివరించింది. ముఖ్యంగా నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్టు తెలిపింది. కామారెడ్డి, మెదక్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వాన కురువగా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురిసినట్టు పేర్కొన్నది.

# దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో మరో 47 మంది మావోలు

మొదటిపేజీ తరువాయి

తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు. 2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్షణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

# గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం సమాయత్తం

**- దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**

**- భక్తులకు ఇబ్బందులు లేకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, మే 26 : రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సమాయత్తం అవుతోందని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. పుష్కరాల నిర్వహణ కోసం సుమారు రూ.1000 కోట్ల నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంగళవారం సరస్వతి అంత్య పుష్కరాల 6వ రోజు సందర్భంగా కాళేశ్వరానికి విచ్చేసిన కమిషనర్, భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లతో కలిసి మెగా విశ్రాంతి భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సరస్వతి ఆది, అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పించిన సౌకర్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ సరస్వతి పుష్కరాల సందర్భంగా ఎదురైన లోటుపాట్లను గుర్తించి, గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందుకోసం గోదావరి పరివాహక ప్రాంత జిల్లాల కలెక్టర్లతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, త్రాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, విద్యుత్ సరఫరా, వీఐపీ, వీవీఐపీ పర్యటనల ఏర్పాట్లపై జిల్లాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు



సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్లు, సరస్వతి విగ్రహం, టెంట్ సిటీ, వ్యాపార స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ స్థలాల నుంచి సరస్వతి ఘాట్ వరకు ఉచిత షటిల్ బస్సులు నడిపినట్లు చెప్పారు. గత ఆది పుష్కరాల రెండో రోజు భారీగా భక్తులు రావడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయని, ఈసారి సరస్వతి అంత్య పుష్కరాల్లో వన్‌వే ట్రాఫిక్ విధానం అమలు చేసి అదనపు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని శాఖల సమన్వయంతోనే పుష్కరాలను విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ఈ సమావేశంలో ములుగు, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల కలెక్టర్లు బొర్కడే హేమంత్ సహదేవరావు, కుమార్ దీపక్, సత్యప్రసాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల అదనపు కలెక్టర్లు బుజంగరావు, వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం ఆర్డీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలపై ప్రేమ ఉంటే పెట్రోల్ డీజిల్ పై వ్యాట్ తగ్గించండి

**- రైతుల బాధలు సూచిస్తే విధుల నుండి తొలగిస్తారా..?**

**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, మే 26 : బిజెపి పాలిత రాష్ట్రాలలో పెట్రోల్, డీజిల్ రేట్లు 100 రూపాయల లోపే ఉన్నాయని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి మర్రిపెల్లి సత్యమ్ మాట్లాడుతూ.. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధ సంక్షోభం కారణంగా చమురు ఉత్పత్తి చేసే దేశాలతో పాటు ఇతర దేశాలు కూడా 30 నుండి 40 శాతం వరకు చమురు ధరలు పెంచాయని, కానీ భారతదేశంలో కేవలం 7.5 శాతం మాత్రమే పెరిగాయని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలని అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారత ప్రజలపై భారం పడకుండా ఎక్సైజ్ పన్ను లక్ష కోట్ల రూపాయలు వరకు తగ్గించారని, దానివల్ల జరిగే నష్టాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై విధిస్తున్న విలువ ఆధారిత పన్నును 39 రూపాయల నుండి పది రూపాయలు తగ్గించి తెలంగాణ ప్రజలపై ప్రేమను చాటుకోవాలని అన్నారు. ధర్నా సందర్భంగా అటుగా వెళుతున్న అద్దె బస్సు ఆర్టీసీ డ్రైవర్ అశోక్ రోహిణి కార్తె ప్రవేశించిందని, రైతులు పండించిన పంటలు వడ్లు, మక్కలు కుప్పలు తెప్పలుగా కొనుగోలు కేంద్రాల్లో పడి ఉన్నాయని, వర్షాలు పడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ధర్నాలో పాల్గొన్న మంత్రి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లకు సూచిస్తే జీర్ణించుకోలేక కాంగ్రెస్ నాయకులతో జగిత్యాల డిపో మేనేజర్ కు ఫిర్యాదు చేయించి, విధుల నుండి బహిష్కరించేలా చర్యలు తీసుకోవడం హేయమైన చర్య అని, ప్రజాపాలన అంటే ప్రజలను హింసించడమేనా అని ప్రశ్నించారు. సస్పెండ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల డ్రైవర్ అశోక్ కు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# వరద విపత్తులను ఎదుర్కొనేందుకు పటిష్ట కార్యాచరణ అవసరం

**- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ - ప్రాణ, ఆస్తి నష్ట నివారణే ప్రధాన లక్ష్యమని స్పష్టం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 26 : రానున్న వర్షాకాలంలో సంభవించే వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరద విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో ఖమ్మం జిల్లాలో సంభవించిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. వరదలు ముందస్తు హెచ్చరికలు లభించే విపత్తులని, సరైన ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అందులో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 1077 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ముంపు గ్రామాలు, సంబంధాలు తెగిపోయే ప్రాంతాలు, కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్ల వివరాలను ముందుగానే సిద్ధం చేయాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. లోతట్టు రహదారులు, కల్వర్టులు, ముంపు ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా ఫ్లెక్సీలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ సిబ్బందిని నియమించాలని సూచించారు. భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి మండలంలో వుడ్ కట్టింగ్ యంత్రాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. పాత భవనాలు, ప్రమాదకర పాఠశాల గదులు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు వరదల అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెరువుల కట్టల్లో బలహీనతలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులకు గండిపడకుండా చూడాలని స్పష్టం చేశారు. వరదల అనంతరం దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ వరదల సమయంలో కట్ ఆఫ్ రహదారుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, కీలక ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులను విపత్తు నిర్వహణలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ మండల స్థాయి బృందాల్లో స్థానిక యువత, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. గురుకుల విద్యాసంస్థల్లో కూడా ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వరద నీటి ప్రవాహ వేగాన్ని కూడా అంచనా వేసి ముందస్తు నివేదికలు సిద్ధం చేయాలని, వృద్ధులను ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**- కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్**

**- ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో శాశ్వత పరిష్కార చర్యలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 26 : కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు తాగునీటి సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం కల్పించే దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని 12వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన మూడు నూతన బోర్లను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నామని, ముఖ్యంగా తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. భగత్‌సింగ్‌నగర్ ప్రజలకు తాగునీటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజాసేవే తమ ధ్యేయమని, కార్పొరేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ టౌన్ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని ప్రసాద్, సాంబిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ నాగలక్ష్మి, 53వ డివిజన్ కార్పొరేటర్ బండి నరసింహారావు, 49వ డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్, స్థానిక ప్రజలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్, అసైన్డ్ రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



**- అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ పరంగా కచ్చితంగా న్యాయం జరుగుతుంది**

**- మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్**

**- కలెక్టరేట్‌లో జరిగిన భూముల పరిష్కార సమన్వయ సమావేశం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, మే 26 : నియోజకవర్గ పరిధిలో ఫారెస్ట్, అసైన్డ్ రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అర్హులైన రైతులందరికి ప్రభుత్వ పరంగా కచ్చితంగా న్యాయం జరుగుతుందని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మహబూబాబాద్ నియోజకవర్గం నెల్లికుదురు, ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్ మండలాల పరిధిలో ఫారెస్ట్, రెవెన్యూ, అసైన్డ్ వ్యవసాయ భూముల పరిష్కార సమన్వయ సమావేశం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌ల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ జెన్ సిపాయి భూములు మొదటి వార్‌లో తరతరాల నుండి వారికి వచ్చాయని, అట్టి మండలాలు నెల్లికుదురు, నరసింహ గూడెం సుమారు 250 ఎకరాలు ఉంటాయన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి ఫారెస్ట్ అసైన్డ్ భూ సమస్యల పరిష్కారం కోసం మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని పరిష్కరించాలని తద్వారా పేద ప్రజల మనసుల్లో అధికారులు ఉంటారని తెలిపారు. అందుకు కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. సీతానగారం, గుండెంగా, ముడుపుగల్, నారాయణపురం, నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి చిన్న చిన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోర్టులో ఉన్న భూ సమస్యల కోసం కలెక్టర్ హైదరాబాద్ స్థాయి, భూ పరిపాలన కమిషనర్ తో చర్చించి ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో జాయింట్ సర్వే నిర్వహించి అర్హులైన నిరుపేద వారికి అందించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఫారెస్ట్, రెవెన్యూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల వారు జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, సూచించారు,పని ఒత్తిడి ఉన్న గాని ప్రత్యేకంగా ఈ భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన నిరుపేదలకు పట్టాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్ , తహసిల్దార్లు, ఏడి సర్వే ల్యాండ్, రెవెన్యూ, సర్వే సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, మే 26 : మహబూబాబాద్ జిల్లా రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో గుడుంబా తయారీ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ డా.శబరీష్, ఆదేశాల మేరకు రూరల్ సీఐ అంజలి ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బజానా తండా గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 120 ఇండ్లు, పరిసర ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను గుర్తించారు. అదేవిధంగా అక్రమంగా నిల్వ ఉంచిన 100 కిలోల నల్ల బెల్లం, 20 లీటర్ల గుడుంబా, 20 కిలోల పట్టిక, 16 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వస్తువులకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు రూరల్ సీఐ అంజలి తెలిపారు.తనిఖీల అనంతరం గ్రామస్తులను సమీకరించిన పోలీసులు దొంగతనాలు, ఇంటి చోరీలు, చైన్ స్నాచింగ్ ఘటనల నివారణ, రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు, హెల్మెట్ వినియోగం, చెరువుల్లో ఈత వల్ల కలిగే ప్రమాదాలు, గంజాయి దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, గంజాయి విక్రయాలు, గుడుంబా తయారీ, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్, క్యూ ఆర్ టీ ఫోర్స్, ఏఆర్ మహిళా పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# రెండవ ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**- ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా**

**- ఘనంగా నిర్వహించిన రెండవ ఏఎన్‌ఎంల జిల్లా మహాసభ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 26 : గ్రామీణ స్థాయిలో ప్రజల ఆరోగ్యం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందిస్తున్న రెండవ ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో రెండవ ఏఎన్‌ఎం యూనియన్ (ఏఐటియుసి) ఖమ్మం జిల్లా రెండవ మహాసభ జిల్లా అధ్యక్షురాలు తమ్మారపు జయమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహా మాట్లాడుతూ రెండవ ఏఎన్‌ఎంలు వ్రాత పరీక్ష రాసి రెండేళ్లు గడిచినా ప్రభుత్వం పోస్టుల భర్తీలో జాప్యం చేస్తోందని విమర్శించారు. తక్షణమే పోస్టుల సంఖ్య పెంచి ఎంపిహెచ్ఏ(ఎఫ్) భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న ఏఎన్‌ఎంలకు హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడం అన్యాయమన్నారు. వైద్య రంగానికి పునాదిగా ఉన్న రెండవ ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వ్రాత పరీక్షలో ఉద్యోగం రాకుండా మిగిలిపోయిన వారికి 100 శాతం గ్రాస్ శాలరీతో పాటు రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. భవిష్యత్ పోరాటాలకు రెండవ ఏఎన్‌ఎంలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



# గిడ్ల శ్యామ్ మరణం ఉద్యమానికి తీరని లోటు

**- సింగరేణి కన్వయన్స్ డ్రైవర్ల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకుడు**

**- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, మే 26 : సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ అధ్యక్షుడిగా, కన్వయన్స్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడు గిడ్ల శ్యామ్ అకాల మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు అన్నారు. శ్యామ్ మృతివార్త తెలుసుకున్న సీఐటీయూ రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించింది. అనంతరం ఆసుపత్రి వద్ద భౌతికకాయాన్ని సందర్శించి సీఐటీయూ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. శ్యామ్ అంత్యక్రియల్లో కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా కార్మికలోకం కన్నీరు మున్నీరైంది. ఈ సందర్భంగా బి. మధు మాట్లాడుతూ.. 2020 నుంచి సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘంలో చురుకుగా పనిచేసిన శ్యామ్ ప్రతి కార్మిక సమస్యను తన సమస్యగా భావించి పోరాడిన నాయకుడని కొనియాడారు. కన్వయన్స్ డ్రైవర్ల సంఘాన్ని ఏర్పాటు చేసి, వారి ప్రత్యేక సమస్యల పరిష్కారం కోసం ఆరోగ్య కార్డుల నుంచి జీతాల పెంపుదల వరకు అనేక అంశాలపై పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. చిన్న వయసులోనే తీవ్ర అనారోగ్యంతో శ్యామ్ మృతి చెందడం ప్రతి ఒక్కరినీ కలచివేసిందని, ఆయన ఎంచుకున్న పోరాట మార్గాన్ని కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. శ్యామ్ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, పట్టణ కన్వీనర్ భూక్య రమేష్, నాయకులు యర్రగాని కృష్ణయ్య తదితరులు కూడా శ్యామ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# నేటి "నిధి ఆప్కే నికట్"ను సద్వినియోగం చేసుకోవాలి

**- ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శ్రీనివాస్ పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, మే 26 : ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) నిర్వహించే "నిధి ఆప్కే నికట్" కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ వై.డి. శ్రీనివాస్ కోరారు. ఖమ్మం జిల్లా ఈపీఎఫ్ఓ కార్యాలయం ఆధ్వర్యంలో మే 27న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఖమ్మంలోని లలిత జ్యువెలరీ సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లకు వివిధ సేవలు, అవగాహన కార్యక్రమాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు, కొత్తగా కవరైన సంస్థల యజమానులకు ఈపీఎఫ్ సేవల వివరాలు తెలియజేస్తామని చెప్పారు. అలాగే పెన్షనర్లకు జీవన్ ప్రమాణ్, ఇతర సమస్యల పరిష్కారంపై సహాయం అందించడంతో పాటు, ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com